J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 20 16.10.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• సమరానికి సై!

# పాత పొత్తులు - కొత్త ఎత్తులు

- స్థానిక పోరులో సైతం కలసి పోరాటం
- కూటమి ప్రయోజనాలే ముఖ్యమంటూ లోకేశ్ చొరవ



పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
చందాదారులకు,
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
విజయదశమి
శుభాకాంక్షలు
సం/-

***మునిసిపల్, జిల్లా పరిషత్, పంచాయితీల ఎన్నికల కోసం తెరలేచింది. డిసెంబర్ 2 లేదా 3లోగా స్థానిక సమరాన్ని ముగించాలని ఎన్నికల సంఘం నిర్ణయించి షెడ్యూలు ప్రకటించింది. ఈ క్రమంలో అధికార కూటమి, ప్రతిపక్షహోదా కూడా లేని విపక్షం తమ తమ సైన్యాన్ని సిద్ధం చేశాయి. వైసీపీ యధావిధిగా ఈసారి కూడా ఒంటరి పోరాటానికే రెఢీ అంటుంటే కూటమి పార్టీలు మాత్రం పాత పొత్తులతో కొత్త ఎత్తులతో విజయం కోసం వ్యూహం రచిస్తున్నాయి.***

రాజకీయాల్లో పొత్తులు పెట్టుకోవడం ఒక ఎత్తు, ఆ పొత్తును క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవడం మరో ఎత్తు. ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్న పార్టీలు, సీట్ల పంపకం దగ్గరకు వచ్చేసరికి తమ బలం, బలగం, రాజకీయ భవిష్యత్తుని లెక్కలేసుకోవడం సర్వ సాధారణం. ఆ లెక్కల్లో తేడా వస్తేనే అసలు సమస్య మొదలవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం, జనసేన, భాజపా మధ్య జరుగుతున్న సీట్ల సర్దుబాటు చర్చలు ఇందుకు భిన్నంగా ఏమీ సాగ లేదు. పైకి మూడు పార్టీలు ఒకే మాట మీద ఉన్నట్లు కనిపిస్తున్నా లోపల మాత్రం ఎవరి వాదనలు వారివి, ఎవరి అంచనాలు వారివి. జనసేన ఎక్కువ స్థానాలు కోరడం, తెలుగుదేశం తన క్షేత్రస్థాయి బలాన్ని, కార్యకర్తల ఆకాంక్షలను ముందుకు తీసుకురావడం, ఈ రెండు వైపులా పట్టుదలలు పెరగడంతో చర్చలు ఒక దశలో ప్రతిష్ఠంభనకు చేరినట్లు కూడా రాజకీయవర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. చివరకు కూటమి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు స్వయంగా రంగంలోకి దిగడం, నారా లోకేశ్ సమన్వయానికి చొరవ తీసుకోవడంతో చర్చలకి ముగింపు కార్డు పడింది. స్థానిక పోరులో ఎవరివారే యమునా తీరై బలాలు నిరూపించు కోవడం కంటే కలిసికట్టుగా ముందుకెళ్లడమే మేలన్న దిశగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

## సీట్ల దగ్గరే అసలు పంచాయితీ!

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన మూడు పార్టీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే ఐక్యతను కొనసాగించాలని నిర్ణయించుకున్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మునిసిపల్ ఎన్నికల స్వరూపం భిన్నం. ప్రతి పట్టణంలోను, నగరంలోనూ స్థానిక నాయకులు, ఆశావహులు, కార్యకర్తల బలాబలాలు ఉంటాయి. కొన్ని చోట్ల తెలుగుదేశం బలంగా ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో జనసేనకు పట్టుంటుంది. ఇంకొన్ని చోట్ల భాజపా నాయకులు తమకు అవకాశం కల్పించాలని కోరడం షరా మామూలే. ఈ పరిస్థితుల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు కేటాయించాలన్నది అంత సులభంగా తేలే వ్యవహారం కాదు. ప్రత్యేకించి జనసేన కోరుతున్న స్థానాల సంఖ్య, తెలుగుదేశం ప్రతిపాదిస్తున్న సీట్ల పంపకం మధ్య అంతరం చర్చల్లో ప్రధాన అంశంగా మారినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 శాతం స్థానాలు కావాలని జనసేన కోరినట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరిగింది. అయితే అన్ని స్థానాలను కేటాయించడం సాధ్యం కాదని తెలుగుదేశం నాయకత్వం అతి సున్నితంగా తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లు టీడీపీ వర్గాల సమాచారం. ఎందుకంటే స్థానిక సంస్థల్లో టీడీపీకి కూడా బలమైన నాయకత్వం, విస్తృతమైన కార్యకర్తల వ్యవస్థ ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో ఆ పార్టీ తరపున పోటీ చేయాలని ఆశిస్తున్న నాయకులు ఉన్నారు. వారికి అవకాశం కల్పించాల్సిన బాధ్యత పార్టీపై ఉంది. జనసేనకు ఎక్కువ స్థానాలు కేటాయిస్తే ఇప్పటికే పోటీకి సిద్ధమవుతున్న టీడీపీ నాయకులకు అవకాశం తగ్గుతుంది. మరోవైపు జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోతే ఆ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంటుంది. ఈ రెండు అంశాల మధ్య సమతూకం సాధించడమే చర్చల్లో ప్రధాన సవాలుగా మారిందని వార్త.

## 2024 ఫార్ములానే కొనసాగించాలన్న వాదన!

2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూటమి పొత్తుల లెక్కలు ఎలా ఉన్నాయన్న అంశం కూడా తాజా చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. అప్పటి రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జనసేనకు సీట్లు కేటాయించామని, ఇప్పుడు కూడా అదే తరహా సూత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న వాదన టీడీపీ వైపు నుంచి వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పట్లో కూటమి ఏర్పాటులో భాగంగా జనసేనకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించిన విషయాన్ని

2లో



## సస్పెన్స్ థ్రిల్లర్‌గా పురపోరు

# కూటమి అభ్యర్థిగా బరిలో ఎవరు ?

11లో



# విపిఆర్ సాధించాడు

## నెల్లూరులో ఇ.యస్.ఐ ఆసుపత్రికి టెండర్లు

→ 134 కోట్లతో అంచనాలు

..5లో



# పొత్తులు - ఎత్తులు

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పెద్ద సంఖ్యలో సీట్లు కేటాయిస్తే తమ పార్టీకి చెందిన ఆశావహులకు ఎలా న్యాయం చేయాలన్న ప్రశ్నను ముందుకు తెచ్చినట్లు సమాచారం. అయితే జనసేన వైపు నుంచి స్థానికంగా తమ పార్టీకి ఉన్న బలాన్ని, క్షేత్రస్థాయి నాయకుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నట్లు ప్రచారం సాగింది. అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపకాన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు యథాతథంగా వర్తింపజేయడం సాధ్యం కాదని, ప్రతి ప్రాంతంలోని పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఇక్కడే రెండు పార్టీల మధ్య వాదనలు తీవ్రతరం అయినట్లు రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. జనసేనకు ఎక్కువ సీట్లు ఇవ్వాలన్న ప్రతిపాదనకు టీడీపీ అంగీకరించకపోవడం టీడీపీ తన స్థానిక బలాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడం చర్చలను మరింత సంక్లిష్టం చేశాయని కూడా తెలిసింది.

## పరోక్ష వ్యాఖ్యలతో పెరిగిన రాజకీయ వేడి!

సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్న సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటులో జనసేన పాత్రను తక్కువగా అంచనా వేయకూడదన్న సంకేతాలు ఆయన మాటల్లో కనిపించాయని విశ్లేషకులు అంటున్నారు. గతంలో చంద్రబాబు అరెస్టయిన సమయంలో జనసేన బయటకు వచ్చి నిలబడటం వల్ల ఇతర నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం పెరిగిందన్న భావనను పవన్ కల్యాణ్ వ్యక్తం చేసినట్లు కూడా చర్చ జరిగిందని చెప్తున్నారు. కూటమి విజయానికి జనసేన సహకారం కూడా కీలకమన్న విషయాన్ని గుర్తించాలని ఆయన పరోక్షంగా చెప్పినట్లు రాజకీయ పరిశీలకుల మాట. అయితే టీడీపీ వైపు నుంచి కూడా తమ పార్టీ పాత్రను, బలాన్ని విస్మరించకూడదన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఉన్న సంస్థాగత నిర్మాణం, స్థానిక నాయకత్వం, కార్యకర్తల బలం ఆధారంగా సీట్ల పంపకం జరగాలని టీడీపీ నేతలు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో రెండు పార్టీల మధ్య చర్చలు కేవలం స్థానాల కేటాయింపునకు మాత్రమే పరిమితం కాలేదని, కూటమిలో ఎవరి పాత్ర ఎంత? ఎవరి బలానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? భవిష్యత్తులో పరస్పర సంబంధాలు ఎలా ఉండాలి? అన్న అంశాల చుట్టూ కూడా చర్చ సాగిందని కూటమి వర్గాల సమాచారం.

## స్నేహపూర్వక పోటీ వరకు వెళ్లిందా?

చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లో స్నేహపూర్వక పోటీకి వెళ్లాలన్న ఆలోచన కూడా తెరపైకి వచ్చినట్లు ఒక తరుణంలో ప్రచారం జరిగింది. అంటే రాష్ట్రవ్యాప్తంగా కూటమి కొనసాగుతూనే కొన్ని స్థానాల్లో పార్టీలు తమ బలాన్ని నిరూపించుకునేలా విడివిడిగా పోటీ చేయడం. అయితే అటువంటి నిర్ణయం తీసుకుంటే క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయన్నది నాయకత్వాలకు తెలుసు. ఒకవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో పరస్పరం పోటీ పడితే కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంటుంది. స్థానికంగా ఒక పార్టీ అభ్యర్థికి మరో పార్టీ కార్యకర్తలు సహకరించని పరిస్థితి రావచ్చు. ఎన్నికల తర్వాత కూడా సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అంతే కాకుండా ప్రతిపక్షాలకు రాజకీయంగా అవకాశం కల్పించినట్లవుతుంది. అందుకే సీట్ల పంపకం విషయంలో ఎంత పట్టుదల ఉన్నా చివరకు కూటమి ఐక్యతకు భంగం కలగకుండా పరిష్కారం కనుగొనాలన్న ఆలోచన నాయకత్వాల్లో బలపడినట్లు తెలుస్తోంది. స్నేహపూర్వక పోటీ ఆలోచన చర్చల్లో ఎంతవరకు అధికారికంగా ప్రస్తావనకు వచ్చిందన్నది స్పష్టం కాకపోయినా చర్చలు సుదీర్ఘంగా కొనసాగడానికి కారణమైన అంశాల్లో సీట్ల సంఖ్యపై విభేదాలు ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి.

## పెద్దన్న పాత్రలో చంద్రబాబు!

ఈ దశలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర కీలకంగా మారింది. కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రిగా మూడు పార్టీల మధ్య సమన్వయం సాధించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా తన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆకాంక్షలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జనసేన కోరుతున్న సంఖ్యకు పూర్తిగా అంగీకరించడం ఒకవైపు సమస్య అయితే, ఆ పార్టీ డిమాండ్లను పూర్తిగా పక్కనపెట్టడం మరోవైపు ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉంది. భాజపాకు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ ఒక నిర్ణయానికి రావడం చంద్రబాబు ముందున్న సవాలుగా మారిందని విశ్లేషకులు చెప్తున్నారు. అందుకే సీట్ల పంపకంపై చర్చలు కేవలం కూటమి నేతల స్థాయిలోనే కాకుండా ముఖ్యమంత్రి స్థాయిలోనూ కొనసాగినట్లు సమాచారం. స్థానిక పరిస్థితులను పరిశీలించి, ఏ ప్రాంతంలో ఏ పార్టీకి అవకాశాలున్నాయి? ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారు? ఏ స్థానాన్ని కేటాయిస్తే మరో పార్టీకి ఇబ్బంది కలుగుతుంది? అన్న అంశాలను బేరీజు వేసినట్లు తెలుస్తోంది. టీడీపీకి చెందిన ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల ఆ పార్టీ ప్రయోజనాలను కాపాడటం, జనసేనకు బలం ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీకి అవకాశాలు కల్పించడం, భాజపా నాయకత్వం కోరుతున్న స్థానాలపైనా చర్చించడం, ఇలా అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గాన్ని అన్వేషించి నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## లోకేశ్ జోక్యంతో మళ్లీ కదలిక!

సీట్ల సర్దుబాటు చర్చలు ఒక దశలో మరింత క్లిష్టంగా మారిన సమయంలో నారా లోకేశ్ చొరవ ప్రాధాన్యం సంతరించుకుందన్న మాట కూడా వినపడుతోంది. కూటమి ఐక్యతకు భంగం కలగకుండా ప్రతిష్టంభనను అధిగమించి చర్చలను ముందుకు తీసుకెళ్లాలన్న దిశగా ఆయన వ్యవహరించినట్లు సమాచారం. రాజకీయ పొత్తుల్లో అభిప్రాయ భేదాలు రావడం సహజమే. అయితే అవి పరిష్కారం కాకుండా కొనసాగితే, ఎన్నికల సమయంలో దాని ప్రభావం మొత్తం కూటమిపై పడుతుంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలు పరస్పరం పోటీపడితే గ్రామ, పట్టణ స్థాయిలో ఏర్పడిన రాజకీయ సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని నివారించడమే లోకేశ్ చొరవ వెనుక ప్రధాన ఉద్దేశమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఒక దశలో సీట్ల విషయంలో పట్టుదలగా వ్యవహరించిన నాయకత్వాన్ని మళ్లీ చర్చల బాటలోకి తీసుకురావడం అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని అన్వేషించడం కూటమి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించడం వంటి అంశాల్లో లోకేశ్ కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, లోకేశ్ చొరవ కలిసి చర్చలకు కొత్త దిశను ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## కూటమి ప్రయోజనాలే అంతిమ లక్ష్యం!

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకం అన్నది మూడు పార్టీల మధ్య సంఖ్యల లెక్క మాత్రమే కాదు. ప్రతి పార్టీకి తన రాజకీయ భవిష్యత్తు, స్థానిక నాయకత్వం, కార్యకర్తల ఆకాంక్షలు ఉంటాయి. వాటిని పక్కనపెట్టి నిర్ణయం తీసుకోవడం ఏ పార్టీకి సాధ్యం కాదు. అదే సమయంలో పొత్తులో ఉన్న ఇతర పార్టీలను విస్మరించడం కూడా రాజకీయంగా సరైన వ్యూహం కాదు. తెలుగుదేశం తన బలాన్ని కాపాడుకుంటూనే మిత్రపక్షాలకు అవకాశం కల్పించాలి. జనసేన తనకు ఉన్న రాజకీయ ప్రాతినిధ్యాన్ని విస్తరించుకోవాలి. భాజపా కూడా స్థానికంగా తన ఉనికిని పెంచుకోవడానికి అవకాశాలను కోరుకుంటోంది. ఈ మూడు లక్ష్యాల మధ్య సమతూకం సాధించినప్పుడే కూటమి కలిసి పోటీ చేయాలన్న లక్ష్యం సఫలమవుతుంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషించడం, లోకేశ్ సమన్వయానికి చొరవ తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒక దశలో చర్చలు కఠినంగా సాగినా చివరకు కూటమి ప్రయోజనాలను ముందుపెట్టి పరిష్కారం దిశగా కదలడం సానుకూల పరిణామంగా చూడవచ్చు.

## అధికారిక ప్రకటనతోనే పూర్తి స్పష్టత!

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు దాదాపు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. చర్చల్లో ఎదురైన విభేదాలను అధిగమించి మూడు పార్టీలు ఒకే నిర్ణయంతో ఎన్నికల బరిలోకి దిగగలిగితే, అది కూటమి సమన్వయానికి కీలక పరీక్షలో సాధించిన విజయంగా నిలుస్తుంది. సీట్ల పంపకంలో ఎవరు ఎన్ని స్థానాలు పొందారన్న దానికంటే, అసంతృప్తులను ఎలా సమన్వయం చేశారు? స్థానిక నాయకులకు ఎలా న్యాయం చేశారు? కూటమి ఐక్యతను ఎలా నిలబెట్టారు? అన్న అంశాలే చివరకు కీలకం కానున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు ద్వారా కూటమి నాయకత్వం ఎదుర్కొంటున్న అసలు పరీక్ష ఇదే. విభేదాలు వచ్చినప్పుడు వాటిని మరింత పెంచుకోవడం కాకుండా చర్చలతో పరిష్కరించుకోవడం, పరస్పర రాజకీయ ప్రయోజనాలను గౌరవించడం, రాష్ట్ర ప్రయోజనాలను ముందుంచడం ద్వారా ముందుకు వెళ్లాలన్న సంకేతాలు తాజా పరిణామాల్లో కనిపిస్తున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి అధికారిక ప్రకటనపైనే ఉంది. అది వెలువడితే ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందన్నదానితో పాటు కూటమి సీట్ల సర్దుబాటు ప్రక్రియకు తుది రూపం లభించనుంది. అక్టోబర్ 16నుండి పుర పోరుకి నామినేషన్లు స్వీకరించనున్న తరుణంలో "పాత పొత్తుల కొత్త ఎత్తులు" పై నేడో రేపో స్పష్టత రానుంది.!

# ఎన్‌బీకెఆర్‌లో.. 'హైపర్‌మెష్' సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ




విద్యార్థులకి అవగాహన కల్పిస్తున్న బ్రహ్మానందరెడ్డి

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఇటీవల మెకానికల్ ఇంజనీరింగ్, బి.టెక్ విద్యార్థుల కోసం హైపర్‌మెష్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణా కార్యక్రమం జరిగింది. చెన్నైలోని నార్డెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మల్టీబాడీ డైనమిక్స్ మరియు డ్రైవ్‌ట్రెయిన్ విశ్లేషణ నిపుణుడిగా పనిచేస్తున్న బ్రహ్మానందరెడ్డి పాల్గొని, ఆధునిక ఇంజనీరింగ్ రంగంలో హైపర్‌మెష్ సాఫ్ట్‌వేర్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశ్రమలు కంప్యూటర్ ఆధారిత ఇంజనీరింగ్ విశ్లేషణ, ఫినైట్ ఎలిమెంట్ మోడలింగ్ మరియు ఇంజనీరింగ్ సిమ్యులేషన్లలో విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని తెలిపారు. హైపర్‌మెష్ సాఫ్ట్‌వేర్‌లో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగావకాశాలను మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని హైపర్‌మెష్ వంటి ఆధునిక మోడలింగ్ సాఫ్ట్‌వేర్లలో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. పి.శ్రీహరిరెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 73 ఏళ్ల వృద్ధురాలికి..

# అపోలోలో అధునాతన చికిత్స

దీర్ఘకాలంగా రెండు భుజాల నొప్పి, చేతులను పైకి ఎత్తలేకపోవడం, రోజువారీ పనులు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులతో బాధపడుతున్న 73 ఏళ్ల మహిళకు నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో దశలవారీగా రెండు భుజాలకు రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్మోహన్‌రెడ్డి ఆ వివరాలను తెలియజేస్తూ, ఆమెకు గతంలో కార్డియాక్ బైపాస్ సర్జరీ కూడా జరిగిందని, వయస్సుతో పాటు ఉన్న ఇతర వైద్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శస్త్రచికిత్సకు ముందు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామని తెలిపారు. త్రీ-డీ టెక్నాలజీ ఆధారంగా ప్రీ-ఆపరేటివ్ ప్లానింగ్‌తో శస్త్రచికిత్సను జయప్రదంగా చేశామని తెలిపారు. డాక్టర్ కార్తీక్‌రెడ్డి పమ్మి, డాక్టర్ ప్రవీణ్ జె, అనస్థీషియా డాక్టర్ శ్రీనివాస్‌ల నేతృత్వంలోని తాము ఈ శస్త్రచికిత్సలు నిర్వహించామని తెలిపారు. అపోలో ఆసుపత్రి యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.




వివరాలని వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

# శ్రీ సత్యానందాశ్రమంలో 'సత్సంగం'



మందులను అందజేస్తున్న వైద్యులు



కరుణాకర్‌ని సన్మానిస్తున్న శ్రీహరితీర్థస్వామీజీ

నెల్లూరుజిల్లా కోవూరు సమీపంలోని ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో ఇటీవల శ్రీ సత్యానంద మహర్షుల వారి 30వ ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వాముల వారి అధ్యక్షత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'సత్సంగం' నిర్వహించి భగవద్భక్తి ఎంత మహత్తరమైనదో, భగవన్నామ స్మరణ ఎంత గొప్పదో వివరించారు. భగవదనుగ్రహం కోసం ప్రతిఒక్కరూ నిత్యం భగవంతుని ప్రార్థించాలన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు పాల్గొని శ్రీ సత్యానంద మహర్షి బోధనల వైశిష్ట్యాన్ని తెలియజేశారు. ప్రముఖ అవధాని, వాల్మీకి రామాయణ ఆడియోకర్త కోట రాజశేఖర్ ఈ సందర్భంగా సత్యానందమహర్షిని కీర్తిస్తూ తాను రాసిన పంచరత్న పద్యాలను శ్రావ్యంగా గానం చేశారు. ప్రముఖ స్వామీజీలు రామతీర్థ స్వామీజీ, పురుషోత్తమతీర్థ స్వామీజీ తదితరులు పాల్గొని అందరికీ మంచిని బోధించే 'సత్సంగం' ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ హోమియోపతి వైద్యులు కరుణాకర్, ఆయుర్వేద వైద్యులు హేమంత్‌బాబు వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులను పంపిణీ చేశారు. ప్రముఖ సాహితీవేత్త డా. కరిమద్దెల నరసింహారెడ్డి, ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు బాలు సుబ్బారావు-సుగుణ దంపతులు భక్తులందరికీ ప్రసాద వితరణ గావించారు. ముఖ్యఅతిథులను, వైద్యులను ఆశ్రమం తరపున శ్రీ శ్రీహరితీర్థస్వామీజీ ఆశీర్వదించి సన్మానించారు.

# స్థానిక భేరీ మోగింది



## నెల్లూరు కార్పొరేషన్..
## కావలి, గూడూరు, బుచ్చి, అల్లూరు, ఆత్మకూరు మునిసిపాలిటీల్లో ఎన్నికల సందడి
## నాయకుల్లో ఉత్కంఠ, అధికారుల్లో హడావిడి

ఎన్నికల భేరీ మోగింది. ఇదిగో అదిగో అనుకుంటున్న స్థానిక ఎన్నికలకు ఈనెల 14న షెడ్యూలు కూడా విడుదలైంది. దీంతో 14 నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లయింది. జిల్లాలో మొదట నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు, కావలి, గూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, ఆత్మకూరు మునిసిపాలిటీలకి ఎన్నికలు జరగనున్నాయి.

**16 నుంచే నామినేషన్లు :**

నెల్లూరు నగరపాలకసంస్థ, బుచ్చి–ఆత్మకూరు మునిసిపాలిటీల ఎన్నికలకు నామినేషన్లు ఈనెల 16 నుంచి స్వీకరిస్తారు. 18వతేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుంది. ఈనెల 21న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఈనెల 28న ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. ఆరోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. 30వ తేదీన ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను వెల్లడిస్తారు.

**ఎంపీటీసీ-జడ్పీటీసీలకి :**

అదేవిధంగా ఎంపీటీసీ, జడ్పీటీసీఈ స్థానాల ఎన్నికలకు ఈనెల 19న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. 23వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉంటుంది. 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణల అనంతరం నవంబరు 3న పోలింగ్ నిర్వహిస్తారు. 5న ఫలితాలను వెల్లడించనున్నారు. గ్రామపంచాయతీలకి సంబంధించి మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబరు 26న మొదటి దశ, 29న రెండోదశ, డిసెంబరు 2న మూడో దశ ఎన్నికలు జరుగనున్నాయి.

**రిజర్వేషన్లు ఖరారు :**

జడ్పీటీసీలు, ఎంపీపీల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 13వ తేదీ రాత్రి ప్రకటించారు. జడ్పీటీసీలు(35), ఎంపీపీల స్థానాలు(35), రిజర్వేషన్‌లో జనరల్‌కి 18 లభించగా, ఎస్సీలకు 8 వచ్చాయి. అన్నింటిలో మహిళలకు సగం స్థానాలు లభించాయి. మిగతా వాటిల్లో వివిధ సామాజిక వర్గాలకి కేటాయించారు.

నెల్లూరు కార్పొరేషన్ ఈసారి జనరల్‌గా రిజర్వ్ అయింది. కార్పొరేషన్‌లో మొత్తం 72 డివిజన్లు ఉండగా, 4,89,351మంది ఓటర్లు ఉన్నారు. ఆత్మకూరు మునిసిపాలిటీలో 28 డివిజన్లు ఉన్నాయి. జనరల్ (మహిళ) స్థానంగా రిజర్వేషన్ జరిగింది. ఈ మునిసిపాలిటీలో మొత్తం 26,529 మంది ఓటర్లున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో జనరల్ (మహిళ) స్థానం రిజర్వేషన్ అయింది. ఇక్కడ మొత్తం 28 డివిజన్లు ఉన్నాయి. ఓటర్లు 36,437 మంది ఉన్నారు.

### ఎట్టకేలకి తీరనున్న కష్టాలు

# చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డుకు.. మోక్షం!

- రూ.115.27 కోట్లతో ఆరు లేన్ల అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు

నెల్లూరులోని చింతారెడ్డిపాళెం క్రాస్ రోడ్డు వద్ద ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బంది పెడుతున్న రోడ్డుప్రమాదాల ముప్పుకి త్వరలోనే తెరపడనుంది. హైవే దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితికి 15 నెలల్లో పరిష్కారం లభించనుంది. మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ విపిఆర్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఎన్నో ప్రయత్నాలు చేసి ఈ సమస్యకి పరిష్కారం సాధించారు.

**అండర్‌పాస్‌కి శంకుస్థాపన :**

నెల్లూరు బైపాస్‌లోని చింతారెడ్డిపాళెం జంక్షన్ సమీపంలో రూ.115.27 కోట్లతో ఆరు లేన్ల అండర్‌పాస్, సర్వీస్ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా పనులు ప్రారంభం కావడంతో పరిసర ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆరు లేన్ల అండర్‌పాస్‌కి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ

స్థానిక సంస్థలు, నగరపాలక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పటిష్టంగా నిర్వహించాలని గుంటూరు సౌత్‌జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. ఈనెల 14న ఆయన జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్లతో కలిసి, జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐజీ మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పోలీసు బందోబస్తు, ముందస్తు చర్యలు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం కృషిచేయాలని చెప్పారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలను ముందుగా గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# మహిళలకే అందలం!

## సగం స్థానాలు వారికే!..



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి మహిళలకి మరింత ప్రాధాన్యత లభించింది. రిజర్వేషన్లలోనూ వారిదే పైచేయి. జడ్పీటీసీల్లో మొత్తం 35 స్థానాలకి గాను 18 మహిళలకే దక్కాయి. ఎంపీపీ స్థానాల్లోనూ 35లో 17 వారికే లభించాయి. నెల్లూరు కార్పొరేషన్‌లో 72 స్థానాలుండగా, 36 స్థానాలు మహిళలకే రిజర్వ్ అయ్యాయి. బుచ్చి మునిసిపాలిటీలో 28కి 14, ఆత్మకూరులోనూ 28కి 14 మహిళలకే దక్కాయి. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో కూడా ఇదేవిధంగా సగభాగం మహిళలకే రిజర్వ్ కానుంది. మునిసిపల చైర్మెన్ పదవులు కూడా గూడూరు, బుచ్చి, ఆత్మకూరు మునిసిపాలిటీల్లో మహిళలకే రిజర్వ్ కావడం విశేషం. మొత్తంగా జిల్లా జనాభాలో కూడ పురుషుల (9,56.000)కంటే స్త్రీలే (10,00,548) ఎక్కువగా ఉండడం ఈ జిల్లాలో మహిళల ప్రాధాన్యతని చెప్పకనే చెప్తోంది.

### బాధ్యతలు చేపట్టిన..
# జడ్పీ సీఇఓ



నెల్లూరు జిల్లా పరిషత్తుకి కొత్త సీఇఓగా నియమితులైన మధుసూదన్ ఈనెల 14న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఇఓ బ్రహ్మయ్య, బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జి సీఇఓ వసుమతి, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

**వసుమతికి వీడ్కోలు**

జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి సీఈఓగా పనిచేసిన వసుమతికి ఈ నెల 14న జడ్పీ ఉద్యోగులు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు అధికారిగా కూడా పనిచేసిన వసుమతి ఆ తరువాత జడ్పీ సీఈఓగా కూడా పని చేశారు. ఈ స్థానంలో రెగ్యులర్ సీఈఓగా మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు.




లాయర్
అక్టోబరు 16, 2026

# ప్రపంచానికి పెను సవాలుగా..పేదరికం!

ఏ దేశమైనా సుభిక్షంగా, సంతోషంగా ఉండాలంటే ముందుగా పేదరికం నుంచి బయటపడాలి. అయితే ఎంతో కాలంగా అనేక దేశాలు ఆ దిశలో అడుగులు వేస్తున్నా, దుర దృష్టవశాత్తూ ఆశించిన పురోగతిని అందుకోలేకపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పేదరికం పరిస్థితిపై ఇటీవల ప్రపంచబ్యాంకు రూపొందించిన తాజా నివేదికలను చూస్తే, కోట్లాదిమంది (సుమారు 10.1 శాతం మంది) ప్రజలు ఇంకా తీవ్రమైన పేదరికంలో ఉన్నారని స్పష్టమవుతుంది. అందుకు కారణాలు అనేకం. ముఖ్యంగా యుద్ధాలు ఆయా దేశాల ఆర్థిక పరి స్థితులపై, ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు ఎప్పుడూ చూడని వాతావరణ మార్పులు, కరువులు, వరదల వంటి విపత్తులు మానవాళిని బెంబేలెత్తిస్తున్నాయి. నేటి ఆధునిక కాలంలో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేతికి అందివచ్చినా ప్రపంచదేశాల్లో కోటానుకోట్ల జనం పేదరికంతోనే బాధలు పడుతుండడం విచారకరం. కరోనా మహమ్మారి సృష్టించిన విధ్వంసం నుంచి నేటికీ కోలుకో లేని దేశాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే, మనదేశం మాత్రం ఒకటొకటిగా విపత్తులను సమర్థవంతంగా అధిగ మిస్తూ, ప్రగతిని సాధిస్తూ ముందంజ వేస్తుండడం విశేషం. మనదేశం ఇటీవలికాలంలో గణనీయమైన ప్రగతిని సాధిస్తుండ డంతో, పేదరికం కూడా బాగా తగ్గింది. గత పదేళ్లకాలంలోనే కోట్లాదిమంది ప్రజలు దుర్భర దారిద్ర్యపు పెనుబెబ్బులి కోరల మధ్య నుంచి బయటపడ్డారన్నది వాస్తవం. అంతకుముందున్న సంవత్సరాల్లో 2011 నాటితో పోలిస్తే 27.1 శాతంగా ఉన్న పేదరికం రేటు, 2023 నాటికి 5 శాతానికి తగ్గడం అందుకు నిదర్శనం. ఒక్కమాటలో చెప్పాలంటే, పేదరికాన్ని నిర్మూ లించే అంశంలో మనదేశం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తోందన్నా అతిశయోక్తేమీ కాదు. పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కానీ, ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే సగటు భారతీయుని జీవన ప్రమాణాలు బాగా తక్కువగా ఉంటున్నాయన్నది కాదనలేని సత్యం. దేశంలో అభివృద్ధి అన్నది ఆశాజనకంగానే ఉన్నా, అంతమాత్రానికే అంతా బాగుందని అనుకోలేం. సంపద అన్నది ఏ కొద్దిమంది చేతు ల్లోనే ఉండడం, పేదలు మరింత పేదవారిగా తయారు కావడం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతుండడం వంటివి దేశపురోభివృద్ధికి ప్రతిబంధకంగానే ఉంటున్నాయి. భారత్ లోని ధనికులకంటే, అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశా ల్లోని పేదల జీవనప్రమాణాలే మెరుగ్గా ఉన్నాయని ప్రపంచ బ్యాంకు ఇటీవలే తన తాజా నివేదికలో స్పష్టం చేయడం గమనార్హం. పేదలను ధనికుల స్థాయికి తీసుకురావడం వల్ల దేశం సంపన్న దేశంగా మారదని, దేశవ్యాప్తంగా ఉత్పాదకతను పెంచడమే దేశపురోగతికి సరైన మార్గమని అధ్యయనాల విశ్లేషణ. దేశవ్యాప్తంగా సమగ్రంగా ప్రజలందరి ఆదాయాలు పెరిగినప్పుడే పేదరికం దూరమవుతుందనేది గుర్తుంచుకో వాల్సిన అంశమని నిపుణుల సూచన. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న దేశాల్లో మనదేశం మొదటి వరుసలోనే ఉన్నా, ఒకవైపు సంపదతో పాటు, మరోవైపు అంతేస్థాయిలో పేదరికం కూడా పెరిగిపోతూనే ఉండడాన్ని గమనించాలి. నిరుద్యోగం, అసమానతలు తగ్గిపోయి, సమా నావకాశాలు వస్తే తప్ప అభివృద్ధి ఫలాలు అందరికీ అందవు. అయితే, నిజానికి ఎంతోకాలంగా ఒక పెద్ద జాఢ్యంలా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికాన్ని సమూలంగా నిర్మూలించడమన్నది అంత సులభమయ్యే పని కూడా కాదు. అట్లని ఎంతకాలమిలా పేదరికంతో అవస్థలు పడగలం?..చేయగలిగిన కృషినంతా మరింత పట్టుదలతో చేయాలి. అవినీతికి, ఆశ్రిత పక్షపాతా నికి దూరంగా ఉంటూ, సేవాభావంతో దేశాభ్యున్నతే ధ్యేయంగా అందరూ కలసి పనిచేయాలి. ప్రపంచవ్యాప్తంగా అందివస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, అన్ని రంగాల్లోని మేధావులు, ప్రభుత్వాలు కూడా మునుపటికంటే దీక్షతో పేదరికం నిర్మూలనకి కంకణం కట్టుకుంటే తప్ప ఈ దుస్థితి సమసిపోదు. దేశవ్యాప్తంగా అన్నిచోట్లా ఎక్కడికక్కడ పరిశ్రమ లను ప్రోత్సహించడం, యువతలో నైపుణ్యాలను పెంపొందించి వారికి ఉద్యోగాలను చూపడం, వ్యవసాయరంగం వంటి కీలక రంగాల్లో మార్పులు తెచ్చి, గిట్టుబాటు ధరలు కల్పించి రైతాం గానికి చేయూతనివ్వడం, చేతివృత్తులకు ఊతమివ్వడం, అన్నిరకాల వ్యవస్థలను మేలైన మార్పులతో పటిష్టం చేయడం వంటి ఎన్నో రకాల చర్యలు తీసుకుంటే తప్ప, పేదరికాన్ని జయించలేం!..ఏదేమైనా, ప్రజలందరి జీవనప్రమాణాలు అభివృద్ధి చెందినప్పుడే, మొత్తంగా దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. అదే పేదరికం నిర్మూలనకి కూడా బాటలు వేస్తుంది. ఆ దిశలో ప్రభుత్వాలతో పాటు, ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషిచేయడమే తక్షణ కర్తవ్యం!.....

**(అక్టోబరు 17, అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం)**

# ఎన్నికల వ్యవస్థపై విశ్వాసమే.. ప్రజాస్వామ్యానికి పునాది

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘానికి అత్యంత కీలకమైన స్థానం ఉంది. కోట్లాదిమంది ఓటర్ల విశ్వా సంతో, స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వ హణ ద్వారా ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేయాల్సిన బాధ్యత ఈ సంస్థపై ఉంది. అలాంటి వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరిగేలా జరుగుతున్న పరిణామాలు ప్రజాస్వామ్య ఆరోగ్యానికి ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్‌తో జరుగుతున్న ఉద్యమాల నేపథ్యంలో ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎన్నికల సంఘం పనితీరుపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడం, ఆరోపణలు చేయడం, సంస్కరణలు కోరడం ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే, వ్యక్తులపై విమర్శలకు, వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రచారానికి మధ్య స్పష్టమైన తేడా ఉం డాలి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఎక్క డైనా లోపాలు ఉన్నాయని భావిస్తే, వాటిని నిర్దిష్ట ఆధారాలతో ప్రజల ముందుంచాలి. రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో ప్రశ్నించాలి. అవసరమైతే న్యాయపరమైన పరిష్కారా లను ఆశ్రయించాలి. కానీ, ఆధారాలకంటే ఆరోపణలే ఎక్కువగా వినిపించే వాతా వరణం ఏర్పడితే, ప్రజల్లో అనవసరమైన అనుమానాలు పెరిగే ప్రమాదం ఉంది. ఆ అనుమానాలు ఒక వ్యక్తి లేదా ఒక పార్టీతోనే ఆగిపోవు, క్రమంగా మొత్తం ఎన్నికల ప్రక్రియపైనా ప్రభావం చూప వచ్చు. ఎన్నికల్లో గెలిచినప్పుడు వ్యవస్థను ప్రశంసించడం, ఓడిపోయినప్పుడు అదే వ్యవస్థను ప్రశ్నించడం వంటి ధోరణులు రాజకీయ పార్టీల విశ్వసనీయతను దెబ్బ తీస్తాయి. అదే సమయంలో, ఎన్నికల సంఘం కూడా తన నిర్ణయాల్లో పారదర్శ కతను పాటిస్తూ, ప్రజలు లేవనెత్తే సహేతు కమైన సందేహాలకు స్పష్టమైన సమాధా నాలు ఇవ్వాలి. సంస్థలపై విశ్వాసం కేవలం గౌరవం కోరడం వల్ల ఏర్పడదు నిష్పాక్షికత, జవాబుదారీతనం, పారదర్శ కతతోనే అది నిలబడుతుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలనే డిమాండ్ సరైనదా కాదా అన్నది వ్యక్తిగత అభిప్రాయాల ఆధారంగా కాకుండా, రాజ్యాంగ నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, చట్టపరమైన ప్రమాణాల ప్రకారం నిర్ణయించాల్సిన అంశం. ఉద్యమ కారులు, రాజకీయ పార్టీలు తమ నిరసన లను వ్యక్తం చేసే హక్కును వినియోగించుకో వచ్చు. అదే సమయంలో, ప్రజల్లో భయాం దోళనలు లేదా నిరాధారమైన అనుమా నాలు వ్యాపించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం కూడా ఉంది.

ఎన్నికల సంఘాన్ని విమర్శలకు అతీతమైన సంస్థగా చూడాల్సిన అవసరం లేదు. కానీ, విమర్శ పేరుతో దాని విశ్వసనీ యతను ఆధారరహితంగా దెబ్బతీయడం కూడా సమర్థనీయం కాదు. ప్రజాస్వా మ్యాన్ని బలోపేతం చేయాలంటే సంస్థల లోపాలను సరిదిద్దాలి, వాటి పనితీరును మెరుగుపరచాలి, ప్రజల నమ్మకాన్ని కాపాడాలి. వ్యక్తులపై రాజకీయ పోరాటం కంటే వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించడమే ప్రాధాన్యంగా ఉండాలి. ఎందుకంటే ఎన్నికల సంఘంపై విశ్వాసం ఒక పదవిలో ఉన్న వ్యక్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. అది ఓటు హక్కుపై, ప్రజాతీర్పుపై, ప్రజా స్వామ్య భవిష్యత్తుపై ప్రజలకు ఉండాల్సిన నమ్మకానికి సంబంధించిన అంశం. ఆ నమ్మకాన్ని కాపాడటం రాజకీయ పార్టీ లకు, ఉద్యమకారులకు, ఎన్నికల సంఘా నికి, ప్రతి పౌరుడికి సమానమైన బాధ్యత.

ప్రొ. సీఆర్. విశ్వేశరరావు
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

# అక్కరకు రాని చుట్టం...

మనసులో మాట 119

అసలే ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ మధ్య సంక్షోభంతో ఉడికిపోతున్న పశ్చిమాసియాలో మరో అగ్నిగుండం రాజుకోవడంతో ప్రపంచ దేశాల్లో ఆందోళన పెరుగుతోంది. సౌదీ అరే బియాపై యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారుల దాడుల ముప్పు పెరగడంతో ఇంధన మార్కెట్లపైనా ఒత్తిడి నెలకొంటోంది. సౌదీ అరేబియా దగ్గర అత్యాధునిక యుద్ధవిమానాలున్నాయి. అమెరికా నుంచి కొనుగోలు చేసిన క్షిపణి నిరోధక వ్యవస్థలున్నాయి. అయినప్పటికీ, యెమెన్‌లోని హూతీ ఉద్యమం నుంచి ఎదురవుతున్న డ్రోన్లు, క్షిపణుల ముప్పు సౌదీ భద్రతకు పెద్ద సవాలుగా మారుతోంది. ఇప్పుడు పాకిస్థాన్, తుర్కియేలతో కలిసి 'ముక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందాన్ని' ముందుకు తీసుకొచ్చినా, సంక్షోభ సమ యంలో ఈ భాగస్వామ్యాలు ఎంతవరకు ఆదుకుంటాయన్న ప్రశ్న మిగిలే ఉంది.

హూతీలతో సౌదీకి ఏర్పడిన ఘర్షణను అర్థం చేసుకోవాలంటే యెమెన్ రాజకీయ పరిణామాలను చూడాలి. 2011 అరబ్ ప్రజా ఉద్యమాల తదనంతర పరిణామాల్లో యెమెన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం తలెత్తింది. ఈ పరిస్థితుల్లో ఉత్తర యెమెన్‌లో బలపడిన హూతీ ఉద్యమం 2014లో రాజధాని సనాను స్వాధీనం చేసుకుంది. దీంతో 2015లో సౌదీ అరేబియా నాయకత్వంలోని సంకీర్ణం యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సైనిక జోక్యం చేసుకుంది. ఆ విధంగా హూతీలకు , సౌదీ అరేబియాకు మధ్య శత్రుత్వం కొనసాగుతోంది.

హూతీలు ప్రయోగించే చౌకైన డ్రోన్లను అడ్డుకోవడానికి సౌదీ అత్యంత ఖరీదైన రక్షణ క్షిపణులను ప్రయోగించాల్సి వస్తోంది. ఇది సౌదీ రక్షణ వ్యయాన్ని గణనీయంగా పెంచుతోంది. అంతేకాకుండా, చమురు క్షేత్రాలు, శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు వంటి కీలక మౌలిక వసతులపై నిరంతరం దాడుల ముప్పును కొనసాగించడం ద్వారా సౌదీ ఆర్థిక కార్యకలాపాలను దెబ్బతీయడం, అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో అభద్రత కలిగించడం హూతీల వ్యూహంగా కనిపిస్తోంది.

అమెరికా దశాబ్దాలుగా సౌదీకి ఆయుధాలు విక్రయిస్తూ, సైనిక శిక్షణ, నిఘా సమాచారాన్ని అందిస్తోంది. 2025లో రెండు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ ఒప్పందం కుదిరినప్పటికీ, నాటోలోని 'ఆర్టికల్ 5' తరహాలో సౌదీపై దాడి జరిగితే అమెరికా తప్పనిసరిగా ప్రతిదాడి చేయాలనే స్పష్టమైన నిబంధన ఉన్నట్లుగా ప్రకటించ లేదు. సౌదీ భద్రత అమెరికాకు ముఖ్యమే అయినప్పటికీ, హూతీలపై దాడుల కోసం నేరుగా విస్తృత యుద్ధంలోకి దిగడం అమెరికాకు అనేక వ్యూహాత్మక సమస్యలను తెచ్చిపెట్టవచ్చు. ఇప్పటికే ఇరాన్‌తో ఘర్షణలో నిమగ్నమైన అమెరికా, మరో విస్తృత యుద్ధంలో చిక్కుకోవడం వల్ల కలిగే సైనిక, ఆర్థిక వ్యయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే నిఘా, ఆయుధ సహకారం, సైనిక సలహాలు అందించడం వరకే పరిమితమయ్యే అవకాశముంది.

అమెరికాపై పూర్తిగా ఆధారపడటంలోని పరిమితులను గుర్తిస్తూ సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియేలతో కలిసి 2026 ఆగస్టు 7న 'ముక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం' కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏదో ఒకదానిపై సాయుధ దాడి జరిగితే దాన్ని మిగిలిన దేశాలపై కూడా జరిగిన దాడిగా పరిగణిస్తారు. అయితే ఈ కూటమి ఆచరణాత్మక అమలులో పలు సవాళ్లు ఉన్నాయి. సౌదీ భద్రతకు మద్దతుగా సైనిక వనరులు, సాంకేతిక సహకారం అందించే అవకాశాలున్నప్పటికీ, పాకిస్థాన్ ప్రత్యక్షంగా యెమెన్‌లో హూతీలతో యుద్ధానికి దిగుతుందా అన్న విషయంలో స్పష్టత లేదు. ఇరాన్‌తో సరిహద్దును కలిగి ఉండడం, ప్రాంతీయదౌత్య సమీకరణలు, దేశీయ రాజకీయ పరిస్థితులు, సైనిక వనరుల వినియోగం వంటి అంశాలు పాకిస్థాన్ నిర్ణయాన్ని ప్రభావితం చేయవచ్చు.

నాటో సభ్యత్వం, అధునాతన రక్షణ సాంకేతికత ఉన్న తుర్కియే కూడా.. ఈ రక్షణ ఒప్పందం ఇరాన్‌కు వ్యతిరేకంగా కుదుర్చుకున్నది కాదని స్పష్టం చేయడం ద్వారా, ఇరాన్‌తో నేరుగా ఘర్షణను కోరుకోవడంలేదన్న సంకేతం ఇచ్చింది. సౌదీకి వైమానిక రక్షణ, ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలు, సాంకేతిక సహకారం అందించే అవకాశాలపై తుర్కియే చర్చించినట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో, ప్రత్యక్ష దాడుల్లో పాల్గొనడానికి సైనికులను పంపే విషయంలో తుర్కియే పరిమితులు స్పష్టం చేసింది. అక్టోబరు 12న అధ్యక్షుడు ఎర్డోగాన్ ఈ ఒప్పందాన్ని పార్లమెంటు ఆమోదానికి త్వరలో సమర్పించనున్నట్లు ప్రకటించారు. పార్లమెంట్ ఆమోదం పొందితే కానీ ఒప్పందం ఆచరణాత్మకత విషయంలో స్పష్టత రాదు.

ఒక దేశానికి ఎన్ని మిత్రదేశాలు ఉన్నాయనే దానికంటే, సంక్షోభ సమయంలో ఆ దేశాలు ఏ స్థాయిలో నేరుగా స్పందించడానికి సిద్ధంగా ఉన్నాయన్నదే అసలు ప్రశ్న. సౌదీకి ఇప్పుడు అవసరమైనది కేవలం మరిన్ని ఆయుధాలు, ఒప్పందాలు మాత్రమే కాదు; తన భూభాగాన్ని తానే సమర్థంగా రక్షించుకోగల స్వీయ సామర్థ్యం, మిత్రదేశాల మద్దతుపై ఆచరణాత్మక స్పష్టత, యుద్ధం విస్తరించకుండా నిరోధించే చతురతతో కూడిన దౌత్య వ్యూహం. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ అంతర్జాతీయ సంబంధాల్లో సమతూకం పాటించేందుకు ప్రయత్నిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థను చమురు రంగానికి మాత్రమే పరిమితం చేయకుండా ఇతర రంగాల్లోనూ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే, యెమెన్‌లో హూతీ లను కేవలం ఇరాన్ మద్దతుతో పనిచేసే చిన్న తిరుగుబాటు బృందంగా చూడటం సౌదీ వ్యూహంలో పొరపాటుగా మారిందని చెప్పవచ్చు. యెమెన్‌లో హూతీలకు బలమైన స్వతంత్ర రాజకీయ పునాదులున్నాయి. రాజధాని సనాపై వారు సాధించిన పట్టు ఇందుకు నిదర్శనం. సౌదీ అరేబియా ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే సుమతీ శతకంలోని 'అక్కరకు రాని చుట్టం..' అనే పద్యం గుర్తుకొస్తుంది. సంక్షోభ సమయంలో అండగా నిలవని మిత్రదేశం ఉన్నా లేనట్టే అన్నది ఈ నానుడిలోని అంతరార్థం. అయితే, సౌదీకి నిజంగా ఎవరూ అక్కరకు రారని ఇప్పుడే తేల్చేయలేం. అసలు పరీక్ష ఒప్పందాల ప్రకటనల్లో కాదు, ఆచరణలోనే ఉంటుంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్



- ఫలించిన విపిఆర్ కృషి

## నెల్లూరులో నూరు పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి..

# కేంద్రం గ్రీన్‌సిగ్నల్

### రూ.134 కోట్లతో టెండర్ ప్రక్రియ ప్రారంభం

ఎట్టకేలకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి ఫలించింది. నెల్లూరు నగరంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.134కోట్ల టెండర్ విలువతో ఈఎస్ఐ కార్పొరేషన్ తాజాగా టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో, కార్మికుల ఆరోగ్య భద్రతకు మేలు చేకూర్చే ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురావాలనే విపిఆర్ లక్ష్యం త్వరలోనే పూర్తిస్థాయిలో సాకారం కానుంది. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే నెల్లూరు ప్రాంతంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వేలాది మంది కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయం అందుతుంది.

**విపిఆర్ రెండేళ్ల ప్రయత్నం..**

నెల్లూరులో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కోసం విపిఆర్ 2024 ఆగస్టులోనే నెల్లూరుజిల్లా కలెక్టర్‌కి లేఖ రాశారు. అనంతరం 2024 నవంబర్ 25న కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయని కలిసి ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ తర్వాత 2025 జూలై 23న మరోసారి మంత్రికి లేఖ రాశారు. 2026 ఆగస్టు 3న న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రిని మరోసారి సంప్రదించి త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి అనువైన స్థలంతో పాటు, సిబ్బంది క్వార్టర్ల కోసం ఒక ఎకరం స్థలాన్ని ఇప్పటికే కేటాయించినట్లు విపిఆర్ వివరించారు. విపిఆర్ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి స్పందించి ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించారు. ఈ టెండర్ విలువ రూ.134 కోట్లుగా ఉంది. బిడ్‌లను దాఖలు చేయడానికి 2026 నవంబర్ 3వ తేదీ వరకు గడువు ఉంది. దాఖలైన బిడ్‌లను నవంబర్ 4వ తేదీ తెరవనున్నారు. అవన్నీ పూర్తయితే ఆసుపత్రి నిర్మాణప్రక్రియ ప్రారంభం కానుంది.

## శ్రీసిటీ - ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ వితరణ



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న శ్రీసిటీ, ఎన్ఎస్ సంస్థ ప్రతినిధులు

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో, శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా సత్యవేడులోని బీసీ బాలుర హాస్టల్‌కు రెండో నూతన భవనాన్ని నిర్మించింది. రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని ఈనెల 14న సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొబయాషి, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి ప్రారంభించారు. ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ గత ఏడాది నవంబర్‌లో రూ.50 లక్షల వ్యయంతో తొలి హాస్టల్ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. దానికి కొనసాగింపుగా మరో రూ.50 లక్షలతో రెండో దశ భవనాన్ని నిర్మించింది. డివిజనల్ అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి పి.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ డీజీఎం సంజయ్, హాస్టల్ సంక్షేమాధికారి రామయ్య, ఎన్ఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయనేమైనా రాజ్యాంగానికి అతీతుడా?..

## కేసుల్లో విచారణలకి రాకుండా ఇంకెంతకాలం తప్పించుకుంటారు



### - జగన్‌పై ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం

జగన్ కేసుల్లో పూర్తిస్థాయి విచారణలు జరగాలని, రోజు వారీ విచారణే కాదు.. రోజంతా విచారణ కొనసాగాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కేసులకు సంబంధించి ఇ.డి పిటీషన్ వేయడం నూటికి నూరు శాతం సరైనదేనని, అయితే ఇది ఎప్పుడో జరగాల్సిందని కూడా ఆయన అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, జగన్ కేసులకు సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. గతంలో ప్రధానులు, ఉపప్రధానులపైన నమోదైన కేసుల్లోనే మూడేళ్లలో విచారణ పూర్తయిందని ఆయన గుర్తుచేస్తూ, ప్రధాని, ఉప ప్రధానిగా పనిచేసిన వ్యక్తుల కంటే జగన్‌రెడ్డి ఏమైనా గొప్పోడా.. ఆయనేమైనా చట్టానికి, న్యాయస్థానాలకు, రాజ్యాంగానికి అతీతుడని అనుకుంటున్నారా?.. కనీసం కోర్టు వాయిదాలకు కూడా హాజరుకారా?... అని ఆయన ప్రశ్నించారు. 'డిశ్చార్జి పిటీషన్ల పేరుతో ఎంతకాలం విచారణలను అడ్డుకుంటారు.. వాయిదాలకు హాజరుకాకుండా ఇంకెంతకాలం తప్పించుకుంటారు' అని ఆయన నిలదీశారు.

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని 43వేల కోట్లకుపైగా అక్రమాస్తులు కూడగట్టిన జగన్‌రెడ్డిపై 2011లో సీబీఐ కేసులు నమోదు చేసిందని, అయితే 15ఏళ్లు గడుస్తున్నా విచారణ ప్రారంభం కాని ఆ కేసుల్లో రోజువారీ విచారణ జరిపేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని ఇ.డి కోరిందని ఆయన తెలిపారు. ఇ.డి కోరినట్టు ఆ కేసులను రోజువారీ విచారణతో పాటు రోజంతా విచారణ జరగాలని, త్వరగా తీర్పులు రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఆయన అన్నారు.

**రోజువారీ విచారణకు కోర్టు అనుమతి**

ఇదిలా ఉండగా, సీబీఐ కేసులతో పాటు ఈడీ కేసులనూ రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు ఈ నెల 14న నిర్ణయం తీసుకుంది. రోజువారీ విచారణకు హాజరుకావాలని ఈడీ న్యాయవాదులకి సూచించింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ఈడీ కేసులను సీబీఐ కోర్టు విచారించే అవకాశం ఉందని భావిస్తున్నారు.




శ్రీమతి జక్కా సులోచనమ్మ గారు
జననం : 1946 నిర్యాణం : 2023

## తృతీయ వర్ధంతి

మా కుటుంబ అభివృద్ధికి స్ఫూర్తిప్రదాత
ప్రేమామృతాలను పంచిన అనురాగదేవత

**శ్రీమతి జక్కా సులోచనమ్మ గారు**

పరమపదించి తేది. 21.10.2026 నాటికి
మూడేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

భర్త : జక్కా కోదండరామరెడ్డి (జె.కె.రెడ్డి)
మాజీ శాసనసభ్యులు, నెల్లూరు.

కుమారులు - కోడళ్ళు
జక్కా వినూజ రామ్మోహన్
జక్కా జనార్ధన్‌రెడ్డి - స్మిత

కుమార్తె - అల్లుడు
పద్మజ - ఏ.బి.వి. రమణారెడ్డి

మనుమళ్ళు మనుమరాళ్ళు
జక్కా మనవ్ - రోహిత
జక్కా కోదండ శ్రీవత్స
రిధి - సిద్ధాంత్
ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్

## రెండో డీఎస్సీ వచ్చేసింది

అందరూ ఆశిస్తున్నట్లుగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో నిరుద్యోగుల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. ఈనెల 13వతేది అర్ధరాత్రి డీఎస్సీ-2026 కింద రాష్ట్రవ్యాప్తంగా 2721 పోస్టుల భర్తీకి అనుమతించినట్లు ప్రకటించింది. నోటిఫికేషన్ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థులు తమ దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది.

## కలెక్టర్‌కి వైసీపీ నాయకుల వినతి

జిల్లాలో స్థానిక ఎన్నికలను పారదర్శకంగా జరపాలని, నామినేషన్లు వేసే అభ్యర్థులకు ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అన్ని ధృవపత్రాలను అందించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా నెల్లూరు మేయర్ అభ్యర్థి ఆనం విజయ కుమార్‌రెడ్డిలు ఈనెల 13న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకి వినతిపత్రం సమర్పించారు.

## నీలగిరి సంఘంలో.. పోలీసుల తనిఖీలు

జిల్లాలో నేరనియంత్రణకు పోలీసులు జరుపుతున్న కార్డెన్ సెర్చ్‌లో భాగంగా, ఈనెల 13న నెల్లూరులోని నీలగిరిసంఘంలోని సుమారు 200 ఇళ్లను పరిశీలించారు. పత్రాలు సరిగా లేని 25 ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానికులకు నేర నియంత్రణ చర్యల పట్ల అవగాహన కలిగించారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన

అగ్నిప్రమాదాల పట్ల అవగాహనతో ఉండాలంటూ అగ్నిమాపకశాఖ అధికారులు ఈనెల 13న కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు భయానికి గురికాకుండా, వాటిని ఎలా నివారించాలో చెప్పారు. ఏడీఎఫ్ఓ ఎం.రాజా, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లీనా పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి..ఓ సంజీవని



సీఎంఆర్ఎఫ్ చెక్కులని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రోగులు, పేదలపాలిట సీఎం సహాయనిధి సంజీవని వంటిదని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 13న ఆయన నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న తమ కార్యాలయంలో 113 మంది లబ్ధిదారులకు 1.12కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరింత మంది పేదలకు త్వరలోనే 1.50 కోట్ల విలువైన సీఎం సహాయ నిధి సాయం అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

## ఆకట్టుకునేలా.. సెల్ఫీ పాయింట్



పనులని పరిశీలిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

అందరిలో దేశ భక్తి పెంపొందేలా, దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయులను గుర్తుంచుకునేలా, భావితరాలను సైతం ఆకట్టుకునేలా నెల్లూరు నగరంలో భారీస్థాయిలో ఒక 'సెల్ఫీ పాయింట్'ని ఏర్పాటు చేస్తున్నామని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య చెప్పారు. ఇటీవల ఆయన స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి సమీపంలో చేపడుతున్న ఆ నిర్మాణపు పనులను పరిశీలించారు. నెల్లూరు నగరానికే ఇది హైలెట్‌గా ఉండాలని భావిస్తూ అద్భుతంగా నిర్మిస్తున్నామన్నారు.

## ఏఎస్పీగా.. షేక్ షాను



నెల్లూరు అదనపు ఎస్పీ (క్రైమ్)గా షేక్ షానును నియమిస్తూ ఈనెల13న రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గతంలో ఆమె విజయవాడ నార్త్ ఏసీపీగా, తిరుపతి రైల్వే డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. ఈ ఏడాది అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం చిత్తూరుజిల్లా ఏఎస్పీగా పనిచేస్తూ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

## బాలికల అభ్యున్నతికి బాటలు వేయాలి

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈనెల 11న నెల్లూరులోని మహిళా ప్రాంగణంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, భద్రత, విద్య, సాధికారతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను అధికారులు విడుదల చేశారు. మహిళా ప్రాంగణం మేనేజర్ మాధవి, వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి, నెల్లూరు మండల ఎంఈఓ మురళీధర్, ఏహెచ్‌టీయు ఎస్ఐ నాగయ్య, శ్రీహరి, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ తదితరులు మాట్లాడుతూ, బాలికలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పోషణ, భద్రత, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా వారి సాధికారతకు బాటలు వేయాలని, బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పేర్కొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### ఎన్నికల ప్రచారానికి దిగనున్న..

## ఎమ్మెల్యే కోటంరెడ్డి కుటుంబం



త్వరలో జరుగనున్న నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని మొత్తం 36 డివిజన్లలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం తన కుటుంబ సభ్యులతో విస్తృతంగా ప్రచారం చేసి వారి విజయానికి కృషి చేయనున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, సాయి వైష్ణవితో పాటు కోటంరెడ్డి సోదరులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మొత్తం 36 డివిజన్లలో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఈ సందర్భంగా అన్ని డివిజన్లలో ఆత్మీయ సదస్సులతో పాటు కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. నామినేషన్ ప్రక్రియ దగ్గర నుంచి గెలుపు వరకు కోటంరెడ్డి సభ్యులు దగ్గరుండి నేతలు, కార్యకర్తలను సమన్వయం చేయనున్నారు.

## లేఅవుట్లను తనిఖీచేసిన.. కమిషనర్ నందన్



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అల్లీపురం, ధనలక్ష్మీపురం, కనుపర్తిపాడు, సప్తగిరికాలనీ తదితర ప్రాంతాల్లోని లేఅవుట్లను కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్ ఈనెల 13న ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేఅవుట్లకు సంబంధించిన అనుమతులు, పత్రాలు అన్నీ సరిగా ఉన్నాయో లేదోనని పరిశీలించారు. కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతించిన మేరకే లేఅవుట్ల నిర్మాణాలు జరగాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని లేఅవుట్ల నిర్వాహకులను హెచ్చరించారు. లేఅవుట్ల పరిధిలో నిర్దేశించిన వసతులన్నీ ఏర్పాటయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కరాటేలో..జీవీకే విద్యార్థుల ప్రతిభ



చదువులోనే కాక, కరాటే పోటీల్లోనూ నెల్లూరులోని జీవీకే స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటుకుంటున్నారు. ఈనెల 11న స్థానిక పార్థసారథినగర్‌లోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్-ఆంధ్రప్రదేశ్-2026 ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీలు జరిగాయి. కేటగిరీ బ్రౌన్-3లో జీవీకే స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఇ.కె వేద అక్షయ ప్రథమ బహుమతి సాధించగా, అదే స్కూల్‌కి చెందిన మరో ఇద్దరు చిన్నారులు డి.లక్ష్మీశ్రీజ, డి.ఆదిత్యగుప్తా కూడా కరాటేలోని ఆయా విభాగాల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ ముగ్గురు చిన్నారులు స్థానిక కళాదీప్తి ఇన్‌స్టిట్యూట్‌లో కరాటే శిక్షణ పొందుతున్నారు. తమ చిన్నారులు ముగ్గురికి కరాటేలో బహుమతులు లభించడం పట్ల ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు కళాదీప్తి సుబ్రహ్మణ్యం సంతోషం వ్యక్తం చేస్తూ, ఆ చిన్నారులను అభినందించారు.

## పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 50 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.31,34,707 విలువైన చెక్కులను అందజేశారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఇప్పటివరకు 579 మందికి రూ. 5,19,34,509 విలువైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

## ఆసుపత్రులు.. నిబంధనలు పాటించాలి

బయెా మెడికల్ వ్యర్థాల నిర్వహణలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వారు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఆ వ్యర్థాలను సాధారణ వ్యర్థాలతో కలపకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో వాటిని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. ఈనెల 13న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించి, అధికారులకు వ్యర్థాల నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

## గిరిజన యువతకి.. ఉచిత శిక్షణ

నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్యజిల్లా, కడప జిల్లాల్లోని గిరిజన నిరుద్యోగ యువతకి రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఆపై చదువుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, రెండునెలల పాటు శిక్షణ ఉంటుందని, ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటాయని, వివరాలకు 9440905749 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.





శ్రీ షిరిడి సాయిబాబా వారి విజయదశమి మహాసమాధి మహోత్సవములు

తేది. 20-10-2026 మంగళవారం నుండి 22-10-2026 గురువారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉ॥ 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి
మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక సహస్రనామ, అష్టోత్తర పూజలు జరుగును.
కావున పై పూజా కార్యక్రమములలో పాల్గొనే భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.300/- చెల్లించి తగిన రశీదు పొంది
బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి బాబావారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

ఇట్లు: కార్యవర్గం

శ్రీ షిరిడి సాయిబాబా మందిరం
గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.

## పూండ్ల వెంకురెడ్డి దాతృత్వంతో..

### మహమ్మదాపురంలో 2 కోట్లతో

# శ్రీ వేంకటేశ్వరాలయం!

● శంకుస్థాపన చేసిన మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి



శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరుకు చెందిన ప్రముఖ దాత, ప్రసిద్ధ ఆధ్యాత్మిక సామాజిక సేవాపరాయణుడు పూండ్ల వెంకురెడ్డి దాతృత్వంతో, ఆయన స్వస్థలమైన పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని అత్యద్భుతంగా నిర్మించనున్నారు. ఈ ఆలయ నిర్మాణ శంకుస్థాపనకి ఈనెల 12న మహమ్మదాపురానికి వచ్చిన రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితర ప్రముఖులంతా ఈ సందర్భంగా దాత వెంకురెడ్డి దైవభక్తిని, దాతృత్వాన్ని కొనియాడారు. తన గ్రామంలోనే కాకుండా, నెల్లూరు నగరంలోనూ, జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లోనూ ఆయన సేవాభావంతో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారని. ఆయన వదాన్యత ఎనలేనిదని అందరూ హర్షించారు. తమ స్వగ్రామంలో కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలను వెంకురెడ్డి విరాళంగా ఇవ్వడం అభినందనీయమని నాయకులు ప్రశంసించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు లేని ప్రాంతాలను గుర్తించి, ఒక్కో నియోజకవర్గంలో ఒక ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినటు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లోని స్థలం, పరిస్థితులను బట్టి ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు కూడా మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యం మేరకు 2028 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5వేల నూతన దేవాలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ తరపున ఇప్పటికే సుమారు రూ.14.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కూడా మంత్రి వివరించారు.

# మూడు తరాల సమస్యకి..పరిష్కారం!

## ఇళ్ల పట్టాల పంపిణీతో స్థానికుల్లో ఆనందం



లబ్దిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



ఇళ్ళ పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ దంపతులు

ఇది ఒకనాటి సమస్య కాదు. దాదాపు అరవైవేళ్ళుగా.. అంటే సుమారు మూడు తరాలుగా ఉన్న జటిలసమస్య. నెల్లూరు నగరంలోని సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్నవారు తమకి శాశ్వత ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరుతున్నా ఇంతకాలం ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాకతో, మంత్రి నారాయణ ఆ సమస్యని ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారానికి కృషిచేయడమే కాక, ఈనెల 11న అనేక మందికి ఇళ్ళ పట్టాలు కూడా ఇవ్వడంతో స్థానికుల్లో ఆనందం వెల్లువెత్తింది. అమరావతిలోకి తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1215 మంది లబ్దిదారుల్లో 939 మందికి వర్చువల్‌గా ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడంతో, ఈ సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లయింది. ఈ సందర్భంగా నెల్లూరులో పూలేబొమ్మ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల, కార్పొరేషన్ కమిషనర్ నందన్, మేయర్ సుజాత, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. లబ్దిదారులకు పసుపు కుంకుమ, చీరతో పాటు ఇళ్ల పట్టాలు అందజేయడంతో మహిళలు ఎంతో సంతోషించారు. జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల మాట్లాడుతూ, భగత్‌సింగ్ కాలనీతో పాటు ఇప్పటివరకు మొత్తం 2600 కుటుంబాలకు పట్టాలు అందించినట్లు తెలిపారు. ఇంకా ఈ ప్రాంతాల్లో మరో నాలుగువేల మందికి పట్టాలు అందించాల్సి ఉందని, నెలరోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

# బీసీలకు ద్రోహం చేసిన వైసీపీ

## ఎమ్మెల్సీ బీద రవిచంద్ర విమర్శ



వైసీపీ నేతలు బీసీల రిజర్వేషన్లను అడ్డుకుని తీరని ద్రోహం చేశారని, ఇచ్చిన మాట ప్రకారం తమ పార్టీ తరఫున బీసీలకు న్యాయం చేయడం జరుగుతుందని శాసనమండలి సభ్యులు, టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర చెప్పారు. చట్టసభల్లో బీసీలు ప్రాతినిధ్యం వహించే విధంగా వారికి సముచిత స్థానం కల్పించడమే టీడీపీ లక్ష్యమన్నారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీల అభ్యున్నతి, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లయితే వేలాదిమంది బీసీలు నాయకులుగా ఎదిగేవారని, అటువంటి అవకాశాన్ని నీరుగార్చి బీసీల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం రాజకీయ సమాధి కట్టిందని, పంచాయతీ సర్పంచ్ నుంచి జడ్పీ చైర్మన్లుగా బీసీలు ఎదిగే అవకాశాన్ని దూరం చేసిన చరిత్ర వైసీపీదేనని ఆయన దుయ్యబట్టారు.







# కాలేయ వ్యాధులను..
# నిర్లక్ష్యం చేయొద్దు
## ప్రముఖ వైద్యులు రజనీకాంత్


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, డాక్టర్ రజనీకాంత్

ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని, కాలేయ వ్యాధుల లక్షణా లను నిర్లక్ష్యం చేయ కూడదని ప్రముఖ వైద్యులు రజనీ కాంత్ చెప్పారు. వెంకటగిరి పోలేరమ్మ జాతర సందర్భంగా చెన్నై గ్లెనిగల్స్ ఆసుపత్రివారి సారధ్యంలో, డాక్టర్ రజనీకాంత్ ఆధ్వర్యంలో కాలేయ వ్యాధులు, లివర్ మార్పిడిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెంకటగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజలకు ఉచిత కాలేయ ఆరోగ్య పరీక్షలు (లివర్ స్క్రీనింగ్) నిర్వహించారు. డాక్టర్ రజనీ కాంత్ మాట్లాడుతూ, కాలేయ వ్యాధులకు దారితీసే కారణాలు, ప్రారంభ దశలో కనిపించే లక్షణాలు, వ్యాధి తీవ్రత పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాల గురించి ఆయన వివరించారు. అవసరమైన సందర్భాల్లో లివర్ మార్పిడి, ప్రాణాలను కాపాడే చికిత్సగా ఉపయోగపడు తుందని చెప్పారు. లివర్ మార్పిడి అవసరమైన పేద, ఆర్థికంగా వెనుకబడిన రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. అర్హులైన రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెంకటగిరికి చెందిన లివర్ మార్పిడి గ్రహీత రాజారెడ్డి తన అనుభవాన్ని వివరిస్తూ "డాక్టర్ రజనీకాంత్ గారి చికిత్స వల్ల తనకు పునర్జన్మ లభించిందని, ఆయన చేసిన మేలు ఎన్నటికీ మరువలేనిదని' తెలిపారు.

# బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి..
# రూ.39 లక్షల వైద్య పరికరాలు
## ఐఆర్ఈడీఏ సీఎస్ఆర్ నిధులతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేత


వైద్య పరికరాలని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి ఇటీవల దాదాపు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాలు, ఫర్నీచర్ అందజేశారు. ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ తన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా వీపీఆర్ ఫౌండేషన్ తరఫున వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా అందజేసిన వైద్య పరికరాల్లో రెండు బాయిల్స్ ఆపరేటస్‌లు, ఒక డెలివరీ టేబుల్, మూడు ఈసీజీ మెషీన్లు, ఐదు ఎపిసియోటమీ సిజర్లు, ఒక హాట్ ఎయిర్ ఓవెన్, రెండు ఓటీ షాడో లైట్ డబుల్ డోమ్‌లు, రెండు ఓటీ షాడో లైట్ సింగిల్ డోమ్‌లు, ఎనిమిది పేషెంట్ బెడ్లు, రెండు ఫోటోథెరపీ ఎల్ఈడీ యూనిట్లు, ఒక థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్, ఒక అల్ట్రాసౌండ్ మెషీన్, మూడు వీల్‌ఛైర్లు ఉన్నాయి. ఈ సందర్భంగా విపీఆర్ సతీమణి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీని తాము ఆకస్మికంగా సందర్శించినప్పుడు వైద్య పరికరాలు, అవసరమైన సామాగ్రి కొరతను సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారని, ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, ఫర్నీచర్‌ను సమకూర్చడం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యానికి ఇప్పుడు ఒక అడుగు ముందుకు పడిందన్నారు. పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి ఆమె సూచించారు.

## రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ


బంతి పూలని కోస్తున్న ప్రశాంతమ్మ

బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారు కార్యాలయంలో రైతులకు ఇటీవల రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, రైతుల భూములపై హక్కులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేస్తోందని చెప్పారు. అనంతరం దామరమడుగులోని ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు. తోటలో కూరగాయలు, బంతిపూలను స్వయంగా కోసి, వాటి మార్కెట్ ధరలను తెలుసుకుని కొనుగోలు చేశారు.

# గూడూరు డివిజన్

## కూటమితోనే పట్టణాభివృద్ధి
### ఎమ్మెల్యే పాశం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కూటమితోనే పట్టణాభివృద్ధి అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో హామ్ పథకం ద్వారా 30 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, కాలువలు, లైటింగ్, మౌలికవసతుల ఏర్పాటుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. పలువురికి నివేశ స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని, పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. వార్డుల్లో ప్రధాన సమస్యలు నాయకులు తెలియజేస్తే వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు, కిరణ్‌కుమార్, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పురపోరులో కూటమి ఆశీస్సులు ఎవరికి?




గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఎస్టీ మహిళకి రిజర్వు కావడంతో పట్టణ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో ఛైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకొనేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలు సిద్ధం చేస్తుండగా, అధికార కూటమి తరపున అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దింపుతారన్న అంశం స్థానిక రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీతో కూడిన కూటమి నుంచి పోటీ చేసేందుకు రాజకీయవర్గాల్లో ఉత్కంఠత నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్ పదవులకి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో గూడూరు మన్సిపాలిటీకి ఎస్టీ మహిళ రిజర్వేషన్ కేటాయించారు. ఈ ప్రకటనతో ఛైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకొన్న పలువురు నాయకుల అంచనాలు మారిపోయాయి. రిజర్వేషన్ ప్రకటనకు అనుగుణంగా అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే నిర్ణయంపైనే అందరి దృష్టి ఉంది.

## కన్నుల పండువగా జెండా ఉత్సవం



గూడూరు పట్టణంలో ఆంజనేయ స్వామి వారి జెండా ఉత్సవం ఇటీవల వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీప కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో వీధులన్నీ రద్దీగా మారాయి. మహాలయ అమావాస్య సందర్భంగా గూడూరు పట్టణంలో ఆంజనేయస్వామి వారి జెండా ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో ఈ నెల 10వతేదీ రాత్రి పలు ప్రాంతాల్లో ఆంజనేయస్వామి వారికి విశేష అలంకరణలు చేసి ట్రాక్టర్‌పై నిలిపి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అఘోర డాన్స్, డీజే కాళికా వేషాలు, బేతాళ నృత్యాలు, తెనాలి బ్యాండు రుద్ర తాండవం సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### వాసవి మాత దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

గూడూరు, బజారువీధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఇటీవల కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

## చేగువేర 59వ వర్ధంతి సభ



గూడూరు, మాళ్వనగర్ లోని చేగు వేర ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 9న చేగువేర 59వ వర్ధంతి మరియు ఫౌండేషన్ వార్షికోత్సవం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు, అధ్యక్షులు గుండాల ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ముందుగా చేగువేర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 50మంది భవన నిర్మాణ కార్మికులకు దుప్పట్లు అందజేశారు. దువ్వూరు దిలీప్‌రెడ్డి, రాయల్ క్రికెట్ క్లబ్ అధ్యక్షులు టి.ఆర్ మని, ఎస్‌కె రఫీ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఈ నెల 13వ తేదీ గూడూరు సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలంటూ సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

## రూరల్ సి.ఐగా వెంకట్రావు



గూడూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో రూరల్ సి.ఐగా వెంకట్రావు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. గతంలో రూరల్ సీఐగా పనిచేసిన కిషోర్‌బాబు బదిలీపై వెళ్లడంతో వెంకట్రావు గుంటూరు రేంజ్ ఆఫీసు నుండి గూడూరు రూరల్ సర్కిల్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చర్యలు చేపడతామని తెలిపారు.

## 'గేమ్ చేంజర్' శ్యాంయాదవ్


'గేమ్ చేంజర్' అవార్డుని అందుకుంటున్న మయూరి శ్యాంయాదవ్

ప్రముఖ సామాజికవేత్త, ప్రజా సేవలో నిరంతరం శ్రమిస్తున్న గూడూరు చెందిన శ్రీకృష్ణ సేవాసమితి ఫౌండర్, ఛైర్మెన్ డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యాంయాదవ్)ని 'గేమ్ చేంజర్' అవార్డు వరించింది. విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ ఫిల్మ్ ఛాంబర్ నందు ఈనెల 11వతేదీ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌కుమార్ చేతులమీదుగా విశ్వగురు వరల్డ్ సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు సమక్షంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

# ఆరోగ్యకరమైన స్నేహాలు: మనసును కాపాడే సరిహద్దుల శక్తి!

మనిషి జీవితంలో స్నేహం అనేది అత్యంత విలువైన అనుబంధం. స్నేహం మనసుకు ఆనందాన్ని ఇస్తుంది, కష్టసమయంలో ధైర్యాన్ని ఇస్తుంది, విజయసమయంలో వినయాన్ని నేర్పిస్తుంది. కానీ స్నేహం ఆరోగ్యకరంగా ఉండాలంటే, దానికి సరిహద్దులు అవసరం. సరిహద్దులు లేకుండా ఉన్న స్నేహం మనసును అలసింపజేస్తుంది, వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తుంది. సరిహద్దులు ఉన్న స్నేహం మనసును కాపాడుతుంది, సంబంధాన్ని నిలబెడుతుంది. స్నేహం అనేది పరస్పర గౌరవం మీద నిలబడాలి. ఒక స్నేహితుడు మన వ్యక్తిగత సమయాన్ని, మన భావాలను, మన నిర్ణయాలను గౌరవించకపోతే, ఆ స్నేహం మనసుకు భారంగా మారుతుంది. కానీ ఒక స్నేహితుడు మన పరిమితులను గౌరవిస్తే, ఆ స్నేహం మనసుకు శాంతిని ఇస్తుంది. "స్నేహం అంటే అనుబంధం, సరిహద్దులు అంటే స్వీయ గౌరవం" అనే మాటలో ఉన్న సత్యాన్ని యువత గ్రహించాలి.

ఉదాహరణకు, ఒక విద్యార్థి తన స్నేహితులతో ఎక్కువ సమయం గడపడం వల్ల చదువుకు సమయం ఇవ్వలేకపోతే, అది అతని భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. కానీ అతను తన స్నేహితులకు స్పష్టంగా చెప్పగలిగితే–"నేను ప్రతిరోజూ ఒకగంట చదవాలి, ఆ తర్వాతనే కలుస్తాను"..అదిఒకసరిహద్దు. ఆ సరిహద్దు అతని స్నేహాన్ని నిలబెడుతుంది, అతని చదువును కాపాడుతుంది. సరిహద్దులు పెట్టడం అనేది స్నేహాన్ని తగ్గించడం కాదు; అది స్నేహాన్ని ఆరోగ్యకరంగా మార్చడం. స్నేహంలో సరిహద్దులు అనేవి మనసును రక్షించే కవచం. ఒక యువతి తన స్నేహితులతో ఆనందంగా గడపడం ఇష్టపడుతుంది. కానీ ఆమెకు వ్యక్తిగత సమయం కూడా అవసరం. ఆమె తన స్నేహితులకు చెప్పగలిగితే–"నాకు ప్రతిరోజూ కొంత సమయం నాకోసం కావాలి"..అదిఒకసరిహద్దు. ఆ సరిహద్దు ఆమె మనసును కాపాడుతుంది, ఆమె స్నేహాన్ని నిలబెడుతుంది.

స్నేహంలో సరిహద్దులు పెట్టడం అనేది ఒక ధైర్యం. చాలా మంది "స్నేహితులు బాధపడతారేమో" అని భయపడి సరిహద్దులు పెట్టరు. కానీ నిజమైన స్నేహితుడు మన పరిమితులను గౌరవిస్తాడు. ఒక యువకుడు తన స్నేహితులకు చెప్పగలిగితే–"నేను రాత్రి ఆలస్యంగా బయటఉండలేను"..అదిఒకసరిహద్దు. ఆ సరిహద్దు అతని ఆరోగ్యాన్ని కాపాడుతుంది, అతని స్నేహాన్ని నిలబెడుతుంది. స్నేహం అనేది పరస్పర సహకారం. ఒక స్నేహితుడు మనకు సహాయం చేస్తే, మనం కూడా అతనికి సహాయం చేయాలి. కానీ సహాయం కూడా సరిహద్దు లలో ఉండాలి. ఒక యువతి తన స్నేహితు రాలికి ప్రతిసారీ సమస్యలు పరిష్కరించడా నికి సమయం కేటాయిస్తే, ఆమె తన జీవి తాన్ని మరిచిపోతుంది. కానీ ఆమె చెప్ప గలిగితే–"నేను నీకు సహాయం చేస్తాను, కానీ నాకు కూడా సమయం కావాలి".. అది ఒక సరిహద్దు. ఆ సరిహద్దు ఆమె స్నేహాన్ని నిలబెడుతుంది, ఆమె జీవితాన్ని

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

కాపాడుతుంది. స్నేహంలో సరిహద్దులు పెట్టడం అనేది ప్రేమ. చాలామంది "సరి హద్దులు పెట్టడం అంటే దూరం పెట్టడం" అని అనుకుంటారు. కానీ నిజానికి, సరి హద్దులు పెట్టడం అంటే ప్రేమను నిల బెట్టడం. ఒక యువకుడు తన స్నేహితుడికి చెప్పగలిగితే–"నేను నీతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నాను, కానీ నా కుటుంబానికి కూడా సమయం ఇవ్వాలి"– అది ఒక సరిహద్దు. ఆ సరిహద్దు అతని స్నేహాన్ని నిలబెడుతుంది, అతని కుటుం బాన్ని కాపాడుతుంది. స్నేహంలో సరి హద్దులు పెట్టడం అనేది జ్ఞానం. ఒక విద్యార్థి తన స్నేహితులతో ఎక్కువ సమయం గడపడం వల్ల తన చదువును మరిచిపోతే, అది అతని భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. కానీ అతను తన స్నేహితులకు చెప్పగలిగితే.."నేను చదువుకు సమయం ఇవ్వాలి, ఆ తర్వాతనే కలుస్తాను"..అదిఒకసరిహద్దు. ఆ సరిహద్దు అతని స్నేహాన్ని నిలబెడుతుంది, అతని భవిష్యత్తును కాపాడుతుంది.

మహాభారతంలో స్నేహాల ఉదాహరణలు మనకు స్పష్టమైన పాఠాలను ఇస్తాయి. విశ్వామిత్రుడు హరిశ్చంద్రునితో చేసిన విఫల స్నేహం పరీక్షలతో నిండిపోయి రాజును కష్టాల్లో పడేసింది. ఇది సరిహద్దులు లేకపోతే స్నేహం ఎలా విఫలమవుతుందో చూపిస్తుంది. కర్ణుడు–దుర్యోధనుడి సఫల స్నేహం విశ్వాసం, అంకితభావంతో నిలబడి, ఒకరికి ఒకరు బలంగా నిలిచారు. సఫల స్నేహం అయిన కర్ణ–దుర్యోధన అనుబంధం విశ్వాసం, అంకితభావంతో నిలిచినా, అది ఎవరికీ ఉపయోగపడలేదు ఎందుకంటే వారి స్నేహం ధర్మానికి విరుద్ధంగా, అహంకారం మరియు అన్యాయానికి తోడ్పడింది; అందువల్ల అది చివరికి వారిద్దరికీ నాశనాన్ని మాత్రమే తెచ్చింది. కృష్ణుడు–అర్జునుడి సఫలస్నేహం జ్ఞానం, మార్గదర్శకత్వం, గౌరవం కలిసినప్పుడు స్నేహం ఎంత శ్రేష్ఠంగా మారుతుందో చూపించింది. ఈ మూడు ఉదాహరణలు మనకు చెబుతున్నాయి–స్నేహం ఆరోగ్యకరంగా నిలవాలంటే పరిమితులు, గౌరవం, జ్ఞానం తప్పనిసరి. అప్పుడు మాత్రమే అది మనసును కాపాడే శక్తిగా మారుతుంది. మహాభారతంలో మరో ఉదాహరణగా ద్రౌపది–పాండవులస్నేహాన్నిచూడవచ్చు. ద్రౌపది తన కష్ట సమయంలో పాండవులను మాత్రమే కాకుండా కృష్ణుడిని కూడా ఆశ్రయించింది. ఆ స్నేహం ఆమెకు రక్షణను, ధైర్యాన్ని ఇచ్చింది. ఇది చూపిస్తుంది–స్నేహం ధర్మానికి అనుగుణంగా, పరిమితులు మరియు గౌరవంతో ఉంటే అది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా సమాజానికి కూడా శ్రేయస్సు కలిగిస్తుందని ఈ ఉదాహరణ మనకు చెబుతుంది. నిజమైన స్నేహం అనేది కష్టసమయంలో నిలబడి, మనసును కాపాడే శక్తిగా మారుతుంది. చివరగా, ఆరోగ్యకరమైన స్నేహం అనేది మనసును ఆనందంగా ఉంచుతుంది. సరిహద్దులు ఉన్న స్నేహం మనసును కాపాడుతుంది. స్నేహం అనేది అనుబంధం. సరిహద్దులు అనేది స్వీయ గౌరవం. ఈ రెండు కలిసి ఉన్నప్పుడు మాత్రమే స్నేహం ఆరోగ్యకరంగా ఉంటుంది. యువత ఈ సత్యాన్ని అర్థం చేసుకుని, తమ స్నేహాలలో సరి హద్దులు పెట్టగలిగితే, వారి జీవితాలు వెలుగుతో నిండిపోతాయి.



**వచ్చే వారం :** యువతకు ఆర్థిక జ్ఞానం: భవిష్యత్తును వెలిగించే మార్గదర్శి!

E-mail: reddyu@gmail.com

## అర్హత కలిగిన..
# ప్రతి ఓటరునూ నమోదు చేస్తాం!

- **జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల**



అర్హత కలిగిన ప్రతి ఓటరును నమోదు చేయడం, అర్హత లేని పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడం" అనే ధ్యేయానికి భారత ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఇటీవల ఆయన 'సర్' ప్రక్రియ గురించి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), 2026లో భాగంగా నిర్వహించిన ఎన్యుమరేషన్ దశలో బి.ఎల్.ఓలు 15 జూన్ నుండి 24 జూలై, 2026 వరకు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మరణించడం, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారి పోవడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు కావడం, ఆచూకీ లభించకపోవడం లేదా ఇతర కారణాల వల్ల మొత్తం 2,90,683 మంది ఓటర్లు ఇచ్చిన చిరునామాల్లో లేనట్లు గుర్తించడమైనది. బి.ఎల్.ఓలు ఇంటింటి సర్వే ద్వారా మరణించిన, వేరే చోటికి వెళ్లిన మరియు డూప్లికేట్ ఓటర్ల పేర్లను తొలగించిన తర్వాత, 31.07.2026న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 16,84,056గా నమోదు చేయబడింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత, నోటీసు దశలో, 16.10.2026న ప్రచురించబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చడానికి మరొక 8891 మంది ఓటర్లు అర్హులు కాదని 06.10.2026 నాటికి గుర్తించడం జరిగిందని ఆయన ఆ ప్రకటనలో వివరించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా ఉండిపోకూడదనే ఉద్దేశంతో, (ఆబ్సెంట్, షిఫ్టెడ్, మరణించిన, డూప్లికేట్) ఓటర్లు / నోటీసు దశలోని అనర్హుల పునఃపరిశీలన, కొత్త ఓటర్ల నమోదు మరియు మిగిలిపోయిన అర్హుల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, బూత్ స్థాయి అధికారులు తమ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి తొలగించబడిన 2,99,574 మంది ఓటర్ల జాబితాలతో ఇంటింటికీ వెళ్లి పునఃపరిశీలన జరుపుతారని, ఒకవేళ పొరపాటున ఎవరి పేరునైనా తొలగించినట్లు గుర్తిస్తే, వారి చేత ఫారం–6 పూరింపజేసి, తగిన పరిశీలన అనంతరం నిరంతర సవరణ కింద ఓటర్ల జాబితాలో వారి పేరును చేర్చడానికి సహకరిస్తారని తెలిపారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా అక్టోబరు 16న ప్రచురించబడు తుందని, అయితే, అర్హత సాధించడానికి సంవత్సరంలో నాలుగు తేదీలు (జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1 మరియు అక్టోబర్ 1) అందుబాటులో ఉంటాయని, రాబోయే సంవత్సరం జనవరి 1ని ప్రామాణిక తేదీగా తీసుకుని వార్షిక సంక్షిప్త సవరణ నిర్వహించబడుతుందని తెలిపారు. 16.10.2026న ప్రచురించే తుది జాబితాలో పేరు లేని అర్హులైన ఓటర్లు లేదా తదుపరి అర్హత తేదీల నాటికి అర్హత సాధించే వారు నిరంతర సవరణ సమయంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం–6ను సమర్పించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

## ఆర్టీసీకి త్వరలో..
# కొత్త విద్యుత్ బస్సులు

- **ఇ.డి జగదీష్‌బాబు**

ఆర్టీసీకి త్వరలోనే కొత్త విద్యుత్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.జగదీష్‌బాబు చెప్పారు. ప్రయాణీకుల రద్దీనిబట్టి గ్రామీణ ప్రాంతాలకి బస్సులు నడుపుతామని తెలిపారు. ఈనెల 12న ఆయన ఉదయగిరిలోని ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా సందర్శించి, డిపోలోని అన్ని విభాగాలను తనిఖీచేసి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. రోడ్ల పనులు పూర్తయిన తర్వాత ఉదయగిరి–పోరుమామిళ్ళ మార్గంలో బస్సు సర్వీసును నడిపేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. దసరా సందర్భంగా ముఖ్యమైన ప్రాంతాలకి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. డిపో మేనేజర్ రమేష్‌కుమార్, సీఐ నాగభూషణం, కార్మికులు పాల్గొన్నారు.

# బీజేపీ మహిళా మోర్చా నిరసన




కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించారంటూ ఇటీవల నెల్లూరులో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు రాష్ట్ర మహిళా మోర్చా ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు చిలకల ప్రవీణారెడ్డి తదితరులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును వ్యతిరేకించిందని, ఏనాడూ కాంగ్రెస్ మహిళల హక్కులకు సమాన గౌరవం, అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, 'ఓట్ చోరి' అంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేస్తూ, చనిపోయిన వారి ఓట్లు, అక్రమ వలసదారుల ఓట్లు తొలగించినందుకు ఎలక్షన్ కమిషన్‌ని వ్యతిరేకించడం, అధికార యావతో ప్రధాని మోడీపై అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. సీనియర్ మహిళా నాయకురాలు రాజేశ్వరమ్మ, ఏ.ఎం.సి డైరెక్టర్ ప్రసన్నమ్మ, ప్రధాన కార్యదర్శులు కవిత, హరిత, శివ పార్వతి, సుజన మరియు మహిళా మోర్చా నారీమణులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆలయాలకి..'నవరాత్రి' శోభ

శ్రీ దేవీ నవరాత్రుల సందర్భంగా జిల్లాలోని అన్ని అమ్మవార్ల దేవాలయాల్లో విశేష అలంకారాలు, విశిష్ట పూజలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. జగన్మాత శ్రీ దుర్గాదేవిని వివిధ రూపాలతో, అనేకరకాల అలంకారాలతో పూజించడం నవరాత్రుల విశేషం. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఖడ్గమాల పూజలు, సహస్రనామ పూజలు, సామూహిక కుంకుమార్చనలతో అమ్మవార్ల ఆలయాలు కళకళలాడుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్‌దీపాలంకరణలతో శోభాయమానం చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన నెల్లూరులోని అనేక దేవాలయాల్లో నిత్యపూజలు నిష్టతో నిర్వహిస్తున్నారు. ఈనెల 12న దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి శ్రీ భవాని అలంకారంతో ప్రత్యేక పుష్పాలంకరణలు చేసి, శ్రీ లలిత కుంకుమార్చన, మహాన్యాసపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు. అదేవిధంగా నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళలమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంతో, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని 'శ్రీ బాలాత్రిపురసుందరిదేవి' అలంకారంతో పూజలు చేశారు. మూలాపేటలోని శ్రీమద్ ద్రౌపతి దేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపతి అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. పప్పులవీధిలోని శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారు శ్రీ వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అన్ని ఆలయాల్లోనూ అర్చనలు, హోమాలు హోరెత్తిపోతున్నాయి.



## రాజరాజేశ్వరమ్మ సేవలో కలెక్టర్ హిమాన్షు



శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఇటీవల నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని, ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు నుండి అమ్మవారి ప్రసాదాలు అందుకుంటున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఆయన సతీమణి పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల.



వ్యాపారస్తుల సంక్షేమం కోసం చిన్ని శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఈ నెల 15న నెల్లూరులోని జిపిఆర్ గ్రాండ్‌లో సమావేశమైన 'బిఎన్ఐ ఛాంపియన్స్' బృందం

## డా.కిషోర్స్ రత్నంలో..దసరా సంబరాలు



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్స్‌లో చిన్నారులు ఉత్సాహంగా దసరా సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల బొమ్మలు, దేవతామూర్తుల వివిధ రూపాలతో బొమ్మలకొలువును తీర్చిదిద్దారు. దుర్గామాత రూపాలైన చండీ, గాయత్రి, దుర్గ తదితర అమ్మవారి రూపాలను ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. డా.కిషోర్స్ రోషిణి రత్నం అడ్వాన్స్‌డ్ ఒలంపియాడ్ స్కూల్, టెక్నో ఒలంపియాడ్ స్కూల్, కెలడాన్ స్కూల్స్ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి పాల్గొని విద్యార్థులకు విజయదశమి శుభాకాంక్షలు చెప్పారు. భారతీయ పండుగ వేడుకలు మన సంస్కృతికి ప్రతిరూపమని ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు విద్యార్థులకు వివరించారు. జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర, మేనేజర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## 'చెట్టు=తల్లి'..అవార్డుల సందడి!



రచయిత, దర్శకుడు కళాంజలి అనంత్‌ని సన్మానిస్తున్న చెట్టు=తల్లి బృందం

చెట్టు తల్లితో సమానమంటూ, 'చెట్టు ఈజ్ ఈక్వల్ టు తల్లి' అనే పేరుతో నెల్లూరులోని ప్రముఖ రచయిత, దర్శకుడు కళాంజలి అనంత్ దర్శకత్వంలో రూపొందించిన 'చెట్టు=తల్లి' షార్ట్‌ఫిల్మ్‌కి మొత్తంగా 7 అవార్డులు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఇటీవల 'చెట్టు=తల్లి' టీమ్ అవార్డుల వేడుక జరుపుకుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్-విజయవాడ వారి షార్ట్‌ఫిల్మ్‌ల పోటీలో 'సెకండ్ బెస్ట్ ఫిల్మ్'గా 'చెట్టు=తల్లి' అవార్డును సాధించడం, ప్రముఖ సినీనటుడు మురళీమోహన్, ప్రసిద్ధ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుల నుంచి ఆ అవార్డును అందుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఎదురుగా ఉన్న అవోపా కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ అవార్డుల వేడుకలో పలువురు వక్తలు పాల్గొని అనంత్‌ని, 'చెట్టు=తల్లి' బృందాన్ని అభినందించారు. పర్యావరణ పరిరక్షణకి మొక్కలు నాటుకోవాలే తప్ప, చెట్లను నాశనం చేసుకోవడం మంచిపద్ధతి కాదంటూ ఈ షార్ట్‌ఫిల్మ్‌లో ఇచ్చిన సామాజిక సందేశంతో పాటు, నటీనటుల నటన ఎంతో గొప్పగా ఉన్నాయంటూ అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అవోపా అవోపా అధ్యక్షులు ప్రభాకర్, ఎం.పి ఆంజనేయులు, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ హాస్యనటుడు దోర్నాల హరిబాబు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, గోవిందరాజుల సుభద్రాదేవి, గీత రచయిత మద్దూరు శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి కళాకారుడు విజయకుమార్, డప్పు కళాకారులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, నటీనటులు ఉపేంద్ర, సుఫియా, శిరీష తదితరులు పాల్గొని అనంత్‌ను సన్మానించారు. ప్రముఖ నటుడు దువ్వూరు బెనర్జీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



## 'శ్రీ భవాని'గా..
## ఇరుకళలమ్మవారు!

నెల్లూరు గ్రామదేవత, శక్తిస్వరూపిణి.. చెరువు గట్టున వెలసివున్న శ్రీ ఇరుకళలమ్మ వారి దేవాలయంలో నవరాత్రి వేడుకలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానం చేశారు. నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న అమ్మవారు 'శ్రీ భవాని' అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేసి, ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

## ఆర్డీటీ కాలనీలో..
## ఆటో డ్రైవర్ హత్య
### నిందితుల అరెస్ట్
### వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలను తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు శివారుల్లోని కల్లూరుపల్లి వద్దనున్న ఆర్డీటీ కాలనీలో ఇటీవల ఆటో డ్రైవర్ వరుణ్ అలియాస్ కరుణ్ హత్య సంచలనం కలిగించింది. చిన్న వివాదంతో వరుణ్ హత్యకు గురికావడంతో, ఆయన కుటుంబం రోడ్డునపడింది. ఈ హత్యకేసులోని నిందితులను నెల్లూరురూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 14న రూరల్ డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకటరెడ్డిలు నిందితుల వివరాలను వెల్లడించారు. రోడ్డు పక్కన ఆటో ఆపి బాడుగ మాట్లాడుకుంటున్న ఆటోడ్రైవర్‌తో గొడవపెట్టుకుని ఆటో అద్దం పగలకొట్టి అద్దం ముక్కతో వరుణ్‌పై దాడిచేసి హతమార్చారని వారు తెలిపారు. ఈ హత్యకేసులో నిందితులైన కృష్ణ, నాగరాజ్, కార్తీక్‌లను అరెస్ట్ చేశామని చెప్పారు.

## జొన్నవాడలో వైభవంగా నవరాత్రి వేడుకలు



బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో మూడవ రోజున 'రక్తబీజ వధ' అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉగ్రరూపం ధరించిన అమ్మవారు లోక కల్యాణం కోసం రక్తబీజుడనే రాక్షసుడిని సంహరించిన ఘట్టాన్ని స్మరించుకుంటూ ఆలయ అర్చకులు ఈ విశేషమైన అలంకారం నిర్వహించారు. అనంతరం, అమ్మవారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు, విశేష పుష్పార్చనలు, సామూహిక కుంకుమార్చనలు, హారతి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు దైవదర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు ఎన్.శివకృష్ణ, జొన్నలగడ్డ వరలక్ష్మి, కె.శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

## 'అపోలో'లో వెన్నెముక సమస్యల నివారణకి..
## ప్రత్యేక స్క్రీనింగ్ ప్యాకేజీ



ప్రత్యేక స్క్రీనింగ్ ప్యాకేజీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అపోలో వైద్యులు

ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రజలకు వెన్నెముక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వెన్నెముక స్క్రీనింగ్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రిలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ప్రముఖ న్యూరోసర్జన్‌లు డాక్టర్ ఏవీ.రమణమూర్తి, వెంకట్, డాక్టర్ ఉబేద్ మాట్లాడుతూ, వెన్నెముక ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని, వెన్నునొప్పి సమస్యలేమైనా వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. ప్రస్తుత జీవనశైలిలో ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, శారీరక శ్రమ లేకపోవడం, ఎట్లంటే అట్లా కూర్చోవడం, వయస్సు పెరగడం వంటి కారణాలతో వెన్నునొప్పి, మెడనొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలు పెరుగుతున్నాయని, ఈ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, నిపుణుల సలహా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ ప్రత్యేక స్క్రీనింగ్ ప్యాకేజీని రూ. 4,999కే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీలో ఆర్‌బీఎస్, సీరం క్రియాటినిన్, హిమోగ్లోబిన్ రక్త పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి ఎల్ఎస్ స్పైన్, సి-స్పైన్, ఎక్స్‌రే, న్యూరో సర్జరీ కన్సల్టేషన్, ఫిజియోథెరపీ కన్సల్టేషన్ వంటి సేవలుంటాయని తెలిపారు. ఈ అవకాశం అక్టోబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు. వెన్నునొప్పి లేదా మెడనొప్పి దీర్ఘకాలంగా కొనసాగుతున్నవారు, కాళ్లు లేదా చేతుల్లో తిమ్మిరి, బలహీనత వంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, క్రమమైన శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ముఖ్యమని వివరించారు. హాస్పిటల్ యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### యల్లాయపాళెం విద్యార్థిని క్రీడా ప్రతిభ

కొడవలూరు మండలం యల్లాయపాళెం హైస్కూలులో పదవ తరగతి చదువుతున్న పి.శరణ్య రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. త్వరలో ఏలూరు జిల్లా పెదవేగిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.మల్లికాదేవి తెలిపారు. ఆమెకు శిక్షణ ఇచ్చిన పీఇటీ హరయ్యను ఆమె అభినందించారు.

### కలిగిరి రైతులకు సబ్సిడీ మినుములు

కలిగిరి మండలంలో ఇ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరికీ ఈనెల 13న 75 శాతం సబ్సిడీతో మినుములు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి కలిగిరి మండలానికి 150 క్వింటాళ్ల మినుములు వచ్చాయని, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న రైతులకు మినుములు అందజేయడం జరిగిందని వ్యవసాయాధికారి షేక్ జబీర్ తెలిపారు.

### సున్నపుబట్టిలో అంగన్‌వాడీ కేంద్రం శిథిలం

దగదర్తి మండలం సున్నపుబట్టి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో, అది నిరుపయోగంగా మారింది. చిన్నారులను సమీపంలోని పాఠశాల గదిలో ఉంచి ఆ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ దుస్థితిని గమనించి వెంటనే ఆ కేంద్రానికి నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### మన్మధరావుపేటలో పేకాట : ఇద్దరు అరెస్ట్

విడవలూరు మండలం మన్మధరావుపేటలోని పొలాల్లో పేకాటాడుతున్న ఇద్దరిని ఈనెల 12న పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద నుంచి 3,350 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయికల్యాణ్ తెలిపారు. పోలీసులు దాడి చేపినప్పుడు ఇద్దరు పరారయ్యారని ఆయన అంటూ, మండలంలో జూదం, అసాంఘిక కార్యక్రమాలను సహించేది లేదన్నారు.

### ఏఎస్‌పేటలో వీఆర్ఏల నిరసన

మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో వీఆర్ఏలు తమ కోర్కెల సాధన కోసం చేస్తున్న నిరసనల్లో భాగంగా ఈనెల 12న ఒంటికాలిపై నిలిచి ఆందోళన చేపట్టారు. గత 27 రోజులుగా తాము దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం తమ డిమాండ్ల పరిష్కారాన్ని పట్టించుకోవడం లేదని వీఆర్ఏల సంఘం నాయకులు రామ కృష్ణ, సునీల్, వెంకటరమణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

### కోడూరులో బాలికా దినోత్సవం

తోటపల్లిగూడూరు మండలం కోడూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 11న బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ హేనా, డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికల రక్షణకు, సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆరోగ్యాధికారులు రమేష్, ఉమర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిద్ధీపురంలో వాలీబాల్ పోటీలు

సంగం మండలం సిద్ధీపురం గ్రామంలో యువనేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. జిల్లావ్యాప్తంగా 40 జట్లు ఈ పోటీలకి హాజరయ్యాయని, యువత మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ పోటీలు నిర్వహించామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

### వెంగళరావునగర్‌లో వైద్యశిబిరం

కావలి వెంగళరావునగర్ పీహెచ్‌సీ, డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో ఇటీవల గర్భవతులు, బాలింతలకు వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు ఎం. మహేష్ పాల్గొని ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద వారికి ఆరోగ్యపరీక్షలు చేసి, తగు సలహాలు సూచనలు ఇచ్చారు.

### వెంగారెడ్డిపాళెంలో సామాజిక తనిఖీ సభ

సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఇటీవల సామాజిక తనిఖీ గ్రామసభను నిర్వహించారు. డీఆర్‌టీ శ్రీహరి, మాజీ సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి, ఏపీఓ జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొని పంచాయతీ ఖర్చులకు సంబంధించిన ఆడిట్‌ను పర్యవేక్షించారు.



తక్కువ ధరకే బియ్యం బస్తాని పంపిణీ చేస్తున్న జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

## తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

**• జేసీ మొగిలి వెంకటేశ్వర్లు**

జిల్లాలో ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతు బజార్లలో బియ్యం విక్రయాలను ప్రారంభించారు. ఫత్తేఖాన్‌పేట రైతుబజారులో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఇటీవల బియ్యం విక్రయాలను ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం బస్తాలను అందజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు కిలోకు సుమారు రూ.72 నుంచి రూ.75 వరకు ఉన్నాయని, ఓపెన్ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని సామాన్య మరియు మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని తక్కువ ధరకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. "ధరణి" పథకం ద్వారా సార్టెక్స్ పాలిష్ బిపిటి రకం బియ్యాన్ని కిలో రూ.47కు, 26 కిలోల బస్తా రూ.1,222కు, సార్టెక్స్ పాలిష్ కెఎన్ఎమ్ రకం బియ్యాన్ని కిలో రూ.48కు, చొప్పున 26కిలోల బస్తా రూ.1,248కు విక్రయిస్తున్నారు. జిల్లాలోని రైతు బజార్లు, నవాబుపేట మరియు ఫత్తేఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా అక్టోబర్ 8వ తేదీ నుంచి వినియోగదారులకు విక్రయించడం జరుగుతోంది. జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీనివాసులు, డీఎస్ఓ పుల్లయ్య, మార్కెటింగ్ శాఖ ఏ.డీ అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకునే 'కవన వనం'

**కవితా సంపుటి ఆవిష్కరణలో వక్తలు**



'కవన వనం'ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెళ్లకూరు జయప్రద తదితరులు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి తోట సులోచన రచించిన 'కవన వనం' కవితా సంపుటి ఆవిష్కరణ ఈనెల 15న జరిగింది. పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జరిగిన ఈ ఆవిష్కరణోత్సవానికి పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధరబాబు అధ్యక్షత వహించారు. ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ జయప్రద సోమిరెడ్డి పుస్తకావిష్కరణ చేయగా, తొలి ప్రతిని కవి మోపూరు పెంచల నరసింహం స్వీకరించారు. 'కవన వనం'లోని కవితలు కవయిత్రి సామాజిక స్పృహతో అద్భుతంగా రచించారని వక్తలు కొనియాడారు. పెరసం కార్యదర్శి గోవిందరాజుల సుభద్రాదేవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. గంగిశెట్టి శివకుమార్, ప్రముఖ కవి..కళారత్న చిన్ని నారాయణ రావు, విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, ప్రముఖ సాహితీ వేత్తలు చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఆలూరి శిరోమణిశర్మ, పోలవరపు లక్ష్మీ నరసింహారావు, పొట్లూరు సుబ్రహ్మణ్యం, వై.మునీంద్ర, మాధవ సుధ, పార్లపల్లి నాగేశ్వరి, కూని అంకబాబు, ఇసనాక దయాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొని కవయిత్రి తోట సులోచనను అభినందించి సన్మానించారు.

## ఉపాధి పనులు సక్రమంగా ఉండాలి

విబి జీ రామ్‌జీ ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలని, ఎక్కడా అవకతవకలు లేకుండా పనులను నిర్వహించాలని డ్వామా పీడీ వెంకట శ్రీనివాస ప్రసాద్ చెప్పారు. వింజమూరు మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామంలో 7.80 లక్షల రూపాయలతో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన ఇటీవల పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయన సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### సస్పెన్స్ థ్రిల్లర్‌గా పురపోరు

# కూటమి అభ్యర్థిగా..
# బరిలో ఎవరు?

**నెల్లూరు నగర మేయర్ కూటమి అభ్యర్థిగా బరిలో ఎవరు..? ప్రస్తుతం నెల్లూరు రాజకీయాలలో సస్పెన్స్ థ్రిల్లర్‌గా నడుస్తున్న అంశం ఇదే. రిజర్వేషన్‌లలో మేయర్ స్థానం ఏ సామాజికవర్గానికి వస్తుందో అన్న మీమాంసకి తెరదించుతూ నెల్లూరు స్థానాన్ని అన్‌రిజర్వుడుగా ప్రకటించారు. అంటే కులాలతో, మతాలతో సంబంధం లేకుండా ఆడా, మగా అన్న తేడాలేకుండా ఎవరైనా పోటీచేయొచ్చు. అయితే, రిజర్వేషన్ వ్యవహారం తేలకముందే వైసీపీ తమ పార్టీ మేయర్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డిని ప్రకటించేసింది. ఆ పార్టీ తరపున అభ్యర్థి ఆయనే అన్న విషయం ఇప్పుడు స్పష్టమైపోయింది. ఈ తరుణంలో కూటమి అభ్యర్థిగా చంద్రబాబు, లోకేష్ ఎవరిని బరిలో దింపుతారన్న విషయానికి గురువారం సాయంత్రం వరకు స్పష్టత రాలేదు.**

అయితే, ఓవైపు ప్రస్తుత డిప్యూటీ మేయర్, యాదవ (బీసీ) సామాజికవర్గానికి చెందిన బలమైన అభ్యర్థిగా రూప్‌కుమార్‌యాదవ్ పేరు తొలి నుండి వినపడుతూ వస్తోంటే, మరోవైపు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేరు కూడా అనూహ్యంగా తాజాగా తెరపైకి వచ్చింది. ఇదే తరుణంలో వీరిద్దరి మధ్యలో నేనూ వున్నానంటూ బీజేపీ నాయకుడు సురేంద్రరెడ్డి కూడా సామాజిక మాధ్యమాల వేదికగా హల్‌చల్ చేశారు. ఇప్పుడు సమయం ఆసన్నమయింది. అభ్యర్థి ఎవరో తేల్చాల్సిన టైం వచ్చేసింది. మరో మూడు రోజులలో నామినేషన్ గడువు కూడా ముగిసిపోతుంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి పంచాయతీ అమరావతికి చేరింది.

రూప్‌కుమార్‌యాదవ్‌కి మంత్రి నారాయణ ఆశీస్సులతో పాటు వేమిరెడ్డి దంపతుల దీవెనలు కూడా పుష్కలంగా వున్నాయి. డిప్యూటీ మేయర్‌గా పని చేసిన అనుభవం, అందరి నాయకులతో సత్సంబంధాలు ఆయనకున్న ప్లస్ పాయింట్లు. ఇక ఆనం విజయకుమార్‌రెడ్డికి గట్టి పోటీ కాగలిగిన రెడ్డి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని చెప్పొచ్చు. అంతేకాకుండా తన అన్న రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వున్న అపార రాజకీయ అనుభవం, అటు రూరల్‌లోనూ ఇటు నగరంలోనూ అయనకున్న పరిచయాలు, అనుచరగణం గిరిధర్‌రెడ్డికి కలిసొచ్చే అంశాలు. ఇక బీజేపీ విషయానికి వస్తే ఆ పార్టీ అభ్యర్థిగా వార్తలలో వినిపిస్తున్న సురేంద్రరెడ్డి గట్టోడే. చాలాకాలంగా కాషాయ జెండా మోస్తున్నాడు. ఉద్యమాలు, నిరసనల పేరుతో నిత్యం జనం నోళ్లలో నానుతుంటాడు. బీజేపీ అభ్యర్థిగా అన్నివిధాలా అర్హుడు. అయితే మైనారిటీలు అధికంగా వున్న నెల్లూరు నగరంలో భాజపాకి అనుకూల వాతావరణంకంటే ప్రతికూల పరిస్థితులే ఎక్కువగా ఉంటాయన్నది నగరవాసుల మాట. ఈ క్రమంలో టీడీపీ అభ్యర్థి అయితేనే ప్రత్యర్థికి గట్టి పోటీ అవుతుందన్నది జనాభిప్రాయం. అధినేతల మనసులో ఎవరున్నారో తెలియదు. అందరూ అనుకుంటున్నట్లుగా రూప్‌కుమార్‌యాదవ్‌నో లేక గిరిధర్‌రెడ్డినో అధిష్ఠానం ఖరారు చేస్తుందో? లేక ఎవరూ ఊహించని కొత్త అభ్యర్థిని రంగంలోకి దించుతుందో? వేచిచూడాలి. బహుశా ఈ రాత్రికో రేపు ఉదయానికో స్పష్టత వచ్చే అవకాశాలు వున్నాయి.

నిజానికి 2029 శాసనసభ ఎన్నికలలో రూరల్ వైసీపీ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డి ఉంటారన్న ప్రచారం ఎప్పటినుండో సాగుతోంది. ఇప్పుడు అకస్మాత్తుగా ఆయనని నగర పోరులో దించారు. అలాగే కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా 2029లో శాసనసభ అభ్యర్థిగా రూరల్ బరిలో ఉంటారన్న మాట అనేక సందర్భాల్లో వినిపించింది. ఇప్పుడు ఆయన పేరు కూడా మేయర్ అభ్యర్థిగా వార్తలలోకి ఎక్కింది. ఒకవేళ గిరిధర్‌రెడ్డినే అధిష్ఠానం ఖరారు చేస్తే ఆనం, కోటంరెడ్డిలు రెండున్నరేళ్ళ ముందే ఒకరితో ఒకరు తలపడే పరిస్థితి వస్తుంది.

## కథాసంపుటి ఆవిష్కరణోత్సవం



'అమ్మకొంగు' కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు, కవయిత్రులు

నెల్లూరుకు చెందిన కవి, ఉపాధ్యాయుడు కూని అంకబాబు రచించిన 'అమ్మకొంగు' అనే కథాసంపుటిని ఇటీవల స్థానిక టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో ఆవిష్కరించారు. పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్ పాల్గొని పుస్తకావిష్కరణ చేయగా, అవ్వారు శ్రీధర్ బాబు, శ్రీధరబాబు సభకు అధ్యక్షత వహించి పుస్తకాన్ని సమీక్షించారు. ప్రథమప్రతిని కవయిత్రి గోవిందరాజు సుభద్రా దేవి స్వీకరించారు. కవి అంకబాబు మాట్లాడుతూ, తనను కష్టపడి చదివించిన మాతృమూర్తికి ఈ పుస్తకాన్ని అంకితం గావించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యఅతిథులుగా మోపూరు పెంచల నరసింహం, పాతూరి అన్నపూర్ణ, తోట సులోచన, కొల్లూరు శ్రీనివాసులు, అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొని అంకబాబును సన్మానించారు.

# దశాబ్దాల కల సాకారం!..

## ఆత్మకూరు అభివృద్ధికి.. పవన్ సహకారం

## 8.91 కోట్లతో నాలుగు లేన్‌ల రహదారి ప్రారంభం




వాయుపుత్ర మార్గ్‌ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన ఎన్‌హెచ్ -67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ.8.91 కోట్లతో అభివృద్ధి చేసిన నాలుగు లేన్ల రహదారిని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈనెల13న మంగళగిరి లోని తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఆత్మకూరు అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆ కార్యక్రమాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నం సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు. మొత్తం 2.2 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడంతో పాటు, ఆధునిక హంగులతో తీర్చిదిద్దే పనులు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6.31 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపట్టామని, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో మరో రూ.2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. రహదారి సమీపంలోని ఆలయంలో కొలువైన 50 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం చేస్తున్నట్లు వెల్లడించారు. రహదారుల బలోపేతంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విజ్ఞప్తులపై పవన్‌కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఆత్మకూరు మెట్ట ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా అవసరమైన చర్యలు చేపట్టాలని, సంగం మండలం వీర్లగుడిపాడు వద్ద పెన్నా నదిపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్‌ను ఆదేశించారు. నర్సాపురం నుంచి నాగులపాడు వరకు రహదారి విస్తరణ అంశాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. ఆత్మకూరు ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారమందిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రి ఆనం కుమార్తె లీలా కైవల్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సతీష్‌రెడ్డి సేవలు అభినందనీయం

## ఎస్ఐడీఎం చాంపియన్ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రశంసించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



సతీష్‌రెడ్డికి జ్ఞాపికని బహుకరిస్తున్న రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన 6వ సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మానుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) ఛాంపియన్స్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా అవార్డుల ఎంపికలో జ్యూరీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన ప్రముఖ రక్షణ రంగ శాస్త్రవేత్త, మాజీ డీఆర్‌డీవో ఛైర్మెన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి విశేష సేవలను కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రత్యేకంగా కొనియాడారు. దేశవ్యాప్తంగా వచ్చిన 100కు పైగా నామినేషన్లను అత్యంత నిశితంగా శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి నిజమైన ప్రతిభావంతులను నిష్పాక్షికంగా ఎంపిక చేయడంలో డాక్టర్ సతీష్‌రెడ్డి చూపిన అంకితభావం ఎంతగానో ప్రశంసనీయమని అభినందించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ రక్షణ సాంకేతికతను బలోపేతం చేస్తున్న ఇంజనీర్లు, వర్ధమాన స్టార్టప్‌లను గుర్తించి ప్రోత్సహించడంలో ఆయన మార్గదర్శకత్వం ఎనలేని స్ఫూర్తిని నింపిందని అభినందించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డిని కేంద్రమంత్రి జ్ఞాపికతో సత్కరించారు.

# ధరల నియంత్రణకి చర్యలు

జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతుండడంతో, వాటిని వెంటనే నియంత్రించాలంటూ జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమ నిల్వలపై నిఘా పెట్టాలని, ధరల పరిస్థితిపై ఎప్పటికప్పుడు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈనెల 14న నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కనభవన్‌లో ఆయన నిత్యావసర వస్తువుల వ్యాపారులతో, తూనికలు కొలతల అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. వస్తువులను అధికధరలకు విక్రయించడం, బ్లాక్‌మార్కెట్‌కి పాల్పడడం వంటివాటిని సహించేది లేదన్నారు. బియ్యంతో పాటు ఎరగడ్డలు, కందిపప్పును కూడా రైతుబజార్లలో తక్కువ ధరకే విక్రయించాలన్నారు. తూనికలు కొలతల అధికారులు, మార్కెటింగ్ అధికారులు ప్రతినిత్యం మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పుల్లయ్య, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారిణి పి.అనితాకుమారి, తూనికలు కొలతల శాఖ జిల్లా అదికారి టి.రాంబాబు, ఫుడ్ సేఫ్టీ అధికారి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com